అనుదినం.. జనస్వరం

నిజామాబాద్-కామారెడ్డి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

08 పేజీలు | సోమవారం 01 మే 2023



కార్మిక దినోత్సవం మే డే శుభాకాంక్షలతో
నవతెలంగాణ ప్రత్యేక సంచిక

బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దు

- ప్రతికార్మికుడు లేబర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- భవన నిర్మాణ రంగ కార్మికులు ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవాలి
- సహాయక కార్మిక శాఖ కమిషనర్ సురేంద్ర కుమార్

3లో..



కార్మిక సమస్యలపై అలుపెరగని పోరు...

- మోడీ సర్కారు విధానాలతో అగాధంలోకి కార్మిక వర్గం
- జిల్లాలో పోరాటంలో ముందంజ
- సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నుర్జహాన్



5లో..

చికాగో పోరాట వీరులకు జేజేలు

- నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 137 మేడే వేడుకలకు సర్వం సిద్ధం
- పారిశ్రామిక వాడల్లో, ఖార్ఖానాల్లో ఎగరనున్న ఎర్రజెండా
- నాటి పోరాట స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలపై కార్యాచరణ



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

12 గంటల పనిదినాలకు వ్యతిరేకంగా, 8 గంటల పని కోసం, మెరుగైన వసతుల కోసం, కార్మిక హక్కుల సంరక్షణకు చట్టాల కోసం, సౌకర్యాల కోసం చిగాగోలో 1886లో రక్తం చిందించిన కార్మికులను స్మరించుకుని భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తి పొందే అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం రానే వచ్చింది. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేం దుకు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. పరిశ్రమల్లో, ఖార్ఖానాల్లో నేడు ఎర్రజెండా రెపరెపలాడనుంది. కేంద్రంలోని మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల హక్కుల గురించి ఊసెత్తడం లేదు. యజమాన్యాలకు అనుకూల చట్టాలు చేస్తూ.. కనీసం ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. పని గంటలకు ఎసరు పడింది. బీడీ కార్మికులకు ఉపాధి కరువయ్యింది. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బతుకులు దినదిన గండంగా మారాయి. ఆసుపత్రుల్లో, షాపింగ్ మాల్స్‌లో ఇతర ప్రయివేటు రంగంలోని కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. కనీస వేతనాలు అమలు జరగడం లేదు. తీవ్రమైన శ్రమ దోపిడీ కొనసాగుతోంది.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో కార్మికవర్గం 137వ సారి కార్మిక దినోత్సవం జరుపుకునేందుకు సిద్ధమవుతోంది. పరిశ్రమల్లో, నగరాల్లో, అసంఘటిత రంగంలోని కార్మికులు వాడవాడలా జెండా ఎగరేసేందుకు సిద్ధమయ్యారు. 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో హె మార్కెట్ వద్ద కార్మికులు 12 గంటల పనిదినానికి వ్యతిరేకంగా మొదట ఉద్యమం చేపట్టారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని పిడికెలెత్తారు. కార్మికులు చేస్తున్న వీరోచిత సమ్మెను అణిచివేసేందుకు నాటి పాలక ప్రభుత్వం కార్మికులపై కాల్పులకు తెగబడింది. ఈ కాల్పుల్లో ఏడుగురు కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది మిగతా 2లో..

సఫాయిలే సిపాయిలు

పారిశుధ్య నిర్వహణలో వీరిపాత్ర కీలకం..

- తెల్లవారు నుంచే పనిలో... • సరిపోని వేతనం

నవతెలంగాణ-బోధన్

కోడికూయకముందే తెల్లవారుజామున మబ్బులో చేత చీపిరిపట్టి వీధులను శుభ్రం చేయడంలో, గ్రామస్థులకు తాగునీరు అందించడం, విద్యుత్తు దీపాలు వెలిగించి చీకటిని పారదోలడంలో సిపాయిలవలే పనిచేస్తారు సపాయి కార్మికులు. ఊరంతా శుభ్రం చేసిన గుర్తింపు ఉండదు. ఏ ఒక్క రోజు వీధులను శుభ్రం చేయకుంటే వీధులు కంపులేవడం ఖాయం. అంతటి శ్రమనోర్చి ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ప్రత్యక్షంగా సేవలందిస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చిత్తశుద్ధి కనపర్చడం లేదు.

సరిపోని వేతనాలు.. అందని సరుకులు..

ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలంతో పరిగెడుతూ పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు అందే వేతనం కేవలం రూ.8500/-లు. నేటి కాలంలో కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోని ఆదాయం ఇది. ఈ వేతనం గతంలో కొన్ని నెలలు కార్మికుల ఖాతాలో జమ చేసిన ప్రభుత్వం నిధులు లేకపోవడంతో పంచాయతీ నుంచి పన్నులు వసూలు చేసి కార్మికులు వేతనాలు చెల్లిస్తున్నారు. అలాగే



పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన సబ్బులు, చేతి గ్లౌజులు, నూనెలు, బూట్లు సక్రమంగా అందడం లేదు. కొన్ని జీపీలలో ఇవ్వడమే మానేశారు. దసరా పండుగ సందర్భంగా మాత్రం దుస్తులు అందిస్తున్నారు. సబ్బులు, నూనేలు, బూట్లు, గ్లౌజులు లాంటి సరుకులు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు వ్యక్తిగత శుభ్రత కోల్పోయి అనారోగ్యం పాలవుతున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



గ్రామపంచాయతీలో ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం అమలు చేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ మ్యాన్, కారోబార్ లాంటి కార్మికులు పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించడంతో వారు సతమతమవుతున్నారు. అలాగే ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి. వేతనాలు 30శాతం పెంచి ఇవ్వాలి. ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేయాలి. వేతనాలు ప్రభుత్వమే ప్రతి నెల చెల్లించాలి. కార్మికులకు వారాంతపు సెలవులు, పండగ సెలవులు మంజూరు చేయాలి. కార్మికులపై వేధింపులు మానుకోవాలి. ఎన్ని మేడేలు వచ్చినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. **- గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సాగర్**

బిల్లులు రాకున్నా భోజనం పెడుతున్నాం

- కానీ మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వాలు వివక్ష
- మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి

నవతెలంగాణ-ఎడపల్లి

తమకు బిల్లులు సకాలంలో రాకున్నా.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని.. అయినప్పటికీ మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి అన్నారు. సోమవారం మేడేను పురస్క రించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. జిల్లాలో వందలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లుల అందక అందక అప్పు చేసి పౌష్టికాహారం అందిస్తు న్నారని తెలిపారు. కానీ ప్రభుత్వాలు సరిపడా స్లాబు రేటు ఇవ్వకుండా పని చేయిస్తుంద న్నారు. 'గత 22 సంవత్సరాల



నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఏడేండ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు. రేపటి పౌరులకు అమ్మలా వంట చేసి పెడితే, కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవటం చాలా బాధాకరం. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాల'న్నారు.

కార్మికులతోనే గ్రామంలో స్వచ్ఛత

- తాడ్వాయి సర్పంచ్ బండారి సంజీవులు

నవతెలంగాణ-తాడ్వాయి

కార్మికులతోనే గ్రామం స్వచ్ఛ గ్రామంగా తయారవుతుందని తాడ్వాయి సర్పంచ్ బండారి సంజీవులు తెలిపారు. సోమవారం మేడేను పురస్కరించుకుని నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. గతంలో మా గ్రామంలో తరచూ ఏదో ఒక కాలనీలో సమస్య ఉండేది. ప్రస్తుతం అలాంటి సమస్యలు లేవు. కార్మికులతో రోజుకు ఒక పని చేయిస్తున్నాం. సోమవారం శ్రమదానం, మంగళవారం ఫాగింగ్, బుధవారం శానిటైజర్ గురువారం లైటింగ్, శుక్రవారం వాటరింగ్, శనివారం పని బాగా చేసిన వారికి రూ.500 అందజేసి శాలువాతో సన్మానం లాంటివి చేస్తున్నాం. దాంతో వారు కూడా ఉత్సాహంగా పనిలో ఉంటున్నారు. కార్మికులు లేనిదే మనం లేము.



ఊరు లేచే కంటే ముందే కార్మికులు నిద్ర లేచి వీధులు శుభ్రం చేయడం, నీళ్ళను ట్యాంకుల్లో నుంచి నల్లాలకు పంపడం, మురికి కాలువల్లోంచి చెత్తా చెదారాన్ని ఏరివేయడం వంటివి చేస్తుంటారు. ఊరంతా నిద్ర లేచేసరికి గ్రామం శుభ్రమవుతుంది. కావున గ్రామానికి ముందుగా కావాల్సింది కార్మికులే. అలాంటి కార్మికులందరికీ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు.

మేడే స్ఫూర్తితో హక్కులను సాదిద్దాం : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-ఆర్మూర్

137వ మేడే స్ఫూర్తితో గ్రామపంచాయతీ కార్మికుల హక్కులను పోరాడి సాధిద్దామని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు దాసు పిలుపునిచ్చారు. 137వ మేడేను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. పట్టణంలోని మామిడిపల్లిలోని ఆదర్శనగర్‌లో మేడే పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనే డిమాండ్‌తో మేడే సభలను జరపాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికుల క్రమబద్ధీకరణ కోసం జెఏసి ఆధ్వర్యంలో ఆందోళనకు శ్రీకారం చుట్టామని, జిపి కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున కదలాలని ఆయన సూచించారు. పోరాడితే పోయేదేమీ లేదే బానిస సంకెళ్ల తప్ప అనే నినాదాన్ని మదిలో నింపుకొని కార్మికుల బతుకుల్లో వెలుగు నింపడానికి చికాగో అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చికాగో పోరాట వీరులకు జేజేలు

-మొదటిపేజీ తరువాయి..

కార్మికుల రక్తం చిందింది. ఈ సంఘటనపై ప్రపంచవ్యాప్తంగా కార్మికులలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ పోరాట స్ఫూర్తిని ప్రతియేడాది స్మరించుకునేందుకు, నాటి కార్మికుల త్యాగాలను గుర్తు చేసేందుకు మే1వ తేదీన అంతర్జాతీయ కార్మిక దినోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. కార్మిక చట్టాలను రద్దు చేసి పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచింది. సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కులను రద్దు చేసింది. 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చింది. ఫలితంగా కార్మికులు తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో బడా బడా షాపింగ్ మాల్స్‌లో, ఆసుపత్రుల్లో ఇష్టారీతిన పని చేయిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదు. కనీస వేతనాలు అమలు చేయడం లేదు. ఇక జిల్లాలో మెజార్టీగా ఉన్న బీడీ రంగం కార్మికులకు ఉపాధి దొరకడం గగనమయ్యింది. రెండు జిల్లాల్లో కలిపి సుమారు రెండున్నర లక్షల మంది బీడీ కార్మికులున్నారు. కానీ వీరికి నెలకు 15 రోజులు కూడా పని దొరకడం లేదు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు జరగడం లేదు. ఏమైనా అంటే బీడీ రంగం నష్టాల్లో ఉందని, మేమేం చేయాలని యజమానులు తప్పించుకుంటున్నారు. బీడీ రంగంపై ఆంక్షలు విధిస్తున్న కేంద్ర సర్కారు.. ఈ కార్మికలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపడం లేదు. ఇక స్కీం వర్కర్లుగా పని చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి కూడా అలానే ఉంది. కనీస వేతనాలు అమలు జరగడం లేదు. వెట్టిచాకిరీకి కేరాఫ్ అడ్రస్‌గా మారారు. తీవ్రమైన పని ఒత్తిడి కల్పిస్తున్నారు. ఇదేంటి అంటే ఇష్టం ఉంటే జాబ్‌కు రా లేకపోతే ఇంట్లో కూర్చో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అన్ని రంగాల్లో కాంట్రాక్ట్ విధానం ప్రోత్సహిస్తూ కార్మికులకు దక్కాల్సిన కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. నిజామాబాద్‌లోని బోధన్ షుగర్ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికులకు.. ఇప్పటి వరకు వారికి దక్కాల్సిన ఆర్థిక సహకారాలు అందజేయలేదు. ఇక నిర్మాణ రంగం, ఎలక్ట్రిషియన్ తదితర రంగాల్లో ఉపాధి లేక గల్ఫ్‌బాట పడుతున్నారు. ఆటో, హమాలీ, రవాణ రంగాల్లోనూ ఉపాధి దొరకడం లేదు.

ఈ మేడే స్ఫూర్తితో కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

- దేరడి లక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండలాధ్యక్షురాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మధ్యాహ్న భోజన పథకం మరింత మెరుగుపడాలంటే ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా వంటగదిని ఏర్పాటు చేయాలి. సోమవారం మేడేను పురస్కరించుకుని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. అలాగే సమాన పనికి సమాన వేతనం అందించే దిశగా ప్రభుత్వం



ఆదుకోవాలి.

నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో స్లాబ్ రేట్ పెంచాలి. ఏజెన్సీ నిర్వాహకులకు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కంటే అదనంగా వేతనం పెంచాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దు

- ప్రతికార్మికుడు లేబర్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- భవన నిర్మాణ రంగ కార్మికులు ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవాలి
- సహాయక కార్మిక శాఖ కమిషనర్ సురేంద్ర కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

బాల కార్మికులను పనిలోకి తీసుకోవద్దని, ఒకవేళ ఎవరైనా బాల కార్మికులను పనిలో ఉంచుకుంటే చట్ట రిత్యా తీసుకుంటామని సహాయక కార్మిక శాఖ కమిషనర్ సురేంద్ర కుమార్ అన్నారు. కార్మికులందరూ కార్మిక శాఖలో తమ వివరాలు నమోదు చేసుకుంటే ప్రభుత్వం వరంగా బీమాతో పాటు పలు సందర్భాల్లో ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. కార్మిక దినోత్సవం మే డే పురస్కరించుకొని నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

14 ఏండ్ల లోపు పిల్లలను ఎలాంటి పనుల్లో కూడా తీసుకోకూడదు. 18 సంవత్సరాలలోపు పిల్లలను ప్రమాదకర పనులలో ఉంచరాదు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 22,256 మంది కార్మికులు ఉన్నారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ ఆఫీస్‌లో తమ పేరు వివ రాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకుంటే



మాట్లాడుతున్న సురేంద్రకుమార్

ఒక వేళ కార్మికుడు కూతురి వివాహానికి 30 వేల రూపాయలు, డెలివరీకి 30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందుతుంది. పనిప్రదేశంలో అంగవైకల్యం అయితే 30 వేల రూపాయలు అందుతాయి. అలాగే సహజ మరణం చెందితే 1 లక్ష 30 వేల రూపాయలు, పని చేసే చోట లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే 6 లక్షల 30 వేల రూపాయల బీమా అందజేస్తాం.

కార్మికులకు శిక్షణ

వృత్తి నైపుణ్య శిక్షణ సైతం కార్మిక శాఖ నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి అందజేస్తాం. కార్మికులు ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకుంనే వారికి మిషన్, ఎలక్ట్రిషన్, ప్లంబర్ తదితర వృత్తుల్లో నైపుణ్యత కోసం 15 రోజుల ట్రైనింగ్ ఇస్తాం. తర్వాత సర్టిఫికేట్ అందజేస్తాం. కార్మికుల కూతుర్లకు టైలరింగ్‌పై 90 రోజులు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్‌ను కూడా అందజేస్తాం.

లేబర్ కార్డు పొందాలి

ప్రతికార్మికుడు లేబర్ కార్డు పొందాలి. అప్పుడే ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ ఫలాలు అందుతాయి. లేబర్ కార్డు కోసం 18- 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి. లేబర్ కార్డు 5 సంవత్సరాలు వ్యాలిడిటి ఉంటుంది. అనంతరం రెన్యూవల్ చేసుకో వాలి. రెన్యూవల్‌కు 60 రూపాయలు చెల్లించాల్సి ఉంటు ంది. కార్మికులకు సంబంధించిన వేతనాల విషయంలో వివరాలు తెలుసుకుని కార్మికుడికి వేతనాలు అందేలా చూస్తాం.

ఈశ్రామ్ రిజిస్ట్రేషన్‌తో మేలు

కలెక్టర్ సహకారంతో ఆపరేషన్ స్మైల్ ముస్కాన్ ద్వారా సంవత్సరంలో రెండు సార్లు సర్వే నిర్వహిస్తున్నాం. కార్మికులు ఎవరైనా ఏ రాష్ట్రంలో అయినా, దేశంలో అయినా ఎక్కడైనా పని చేసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఈశ్రామ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ శ్రామ్ ద్వారా ఇప్పటికీ వరకు 50 శాతం రిజిస్ట్రేషన్‌లు చేయించు కున్నారు. పని ప్రదేశంలో ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి. ఫిర్యాదులు చేస్తే తప్పకుండా తనిఖీ చేస్తాం. కార్మికులందరికీ కార్మిక దినోత్సవం మే డే శుభాకాంక్షలు.

కనీస వేతనం, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపుకోసం పోరాటం చేస్తాం

- సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



వనమాల కృష్ణ

కనీస వేతనం, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపుకోసం పోరాటం చేస్తాం. మేడే సందర్భంగా నవతెలంగాణ పత్రికతో మాట్లాడుతూ కనీస వేతనం, సామాజిక భద్రత, పనిగంటల తగ్గింపు జరిగినప్పుడే కార్మికులకు న్యాయం జరుగు తుంది. కార్మికులు పనిచేసే చోట వారి పనిని గుర్తించి పనిచేసే విధానానికి తగినంతగా కనీస వేతనాన్ని అమలు చేయాలి. కార్మికుడు ఏ సంస్థలో పని చేస్తారో ఆ సంస్థ వారు ఆ కార్మికుడికి ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సమాజంలో జీవనం కొనసాగించడానికి కార్మికుడికి సామాజిక భద్రత కల్పించాలి. అదేవిధంగా కార్మికుడు పని చేసే చోట 8 గంటల పనికోసం ఎంతో పోరాటం చేసి తీసుకువస్తే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 12 గంటల పని దినాన్ని పెంచుతున్నారు. అందుకు పనిగంటలను తగ్గించాలి. కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారు. కార్మికులకు శాస్త్రీయంగా వేతనాలను అమలు చేయాలి. రాష్ట్రంలో 70 పారిశ్రామిక రంగాల జీఓలను సవరణ చేయాలి. వారికి కనీస వేతనం ధరలకు అనుగుణంగా నిర్ణయించాలి. కార్మికులకు ఉద్యోగ కల్పన లేక ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు ఫ్యాక్టరీలను లాక్ అవుట్ చేస్తున్నాయి.

ఏం పని ఉంది సార్..

- దుర్భరం.. అడ్డా కూలీల జీవనం
- పని ఎక్కువ.. కూలీ తక్కువ
- దరి చేరని సంక్షేమ ఫలాలు

నవతెలంగాణ-లింగంపేట్

'ఏం పని ఉంది సార్.. ఎక్కడ సార్.. నేను వస్తా..' అడ్డా మీదకు ఎవరైనా వెళ్తే కూలీలు చుట్టూ చేరి పని కోసం పై విధంగా అడుగుతుంటారు. పాలకులు మారినా.. వీరి బతుకులు మాత్రం మారడం లేదు. పని దొరికితేనే ఆ రోజు డబ్బులు. లేకుంటే నిరాశగా ఇంటికి వెనుదిరుగుతుంటారు. పని దొరికినా.. అర కొర కూలీతో దుర్భర జీవనం గడుపుతున్నారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు పాలకులు చెబుతున్నా.. వీరి జీవితాలు మాత్రం మారడం లేదు.

పొద్దున్నే ఉదయం 7 గంటలకు టిఫిన్ పెట్టుకొని అడ్డాల మీదకు కూలీలు వస్తుంటారు. పని కోసం పది గంటల వరకూ వెచి చూస్తారు. అప్పటి లోపు పని దొరికితే ఆ రోజుకు ఫైసల్. లేకుంటే గంటల పాటు పడిగాపులు కాచి వెనక్కు వెళ్లాల్సిందే. అడ్డా మీద వచ్చే కూలే తక్కువ. అయితే పని దొరకకపోవడంతో మరింత తక్కువ కూలీ ఇచ్చినా పనికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో వారికి కష్టానికి తగ్గ ఫలితం రాకుండా పోతోంది. గ్రామాల్లో, పట్టణానికి వలస వచ్చిన వారికి రోజువారి పనులు లేకపోవడంతో జిల్లా, పట్టణ, మండల కేంద్రాల్లో అడ్డాల మీదకు వచ్చి పనుల కోసం వస్తుంటారు. జిల్లా కేంద్రంలో రోజురోజుకు కట్టడాలు జోరుగా కొనసాగడంతో అడ్డా కూలీలకు రోజువారీగా పని దొరుకుతుంది మరోవైపు ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు ఎనిమిది గంటలు పనిచేసిన తక్కువ కూలి రావడంతో చేసేదేమీ లేక పనిచేసే కూలి తీసుకొని వెను తిరుగుతున్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోజురోజుకు భవన నిర్మాణం పనులు ఊపందుకుంటున్నాయి. దీంతో కొందరు ఆంధ్ర నుండి ఒరిస్సా ఛత్తీస్‌ఘడ్ ఝార్ఖండ్ రాయలసీమ ప్రాంతాల



నుండి మేస్త్రీలు దినసరి కూలీలు బ్రోకర్లు ఒప్పందం కుదిరించుకొని పనుల అప్పగిస్తున్నారు. రోజువారీ జిల్లాకు రెండు వేల మందికి పైగా మేస్త్రీలు దినసరి కూలీలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా పాత గంజ్ కొత్త బస్టాండ్ నిజాం సాగర్ చౌరస్తా వీక్లీ మార్కెట్ ప్రధాన కూడలి వద్ద గుంపులు గుంపులుగా పని కోసం పడిగాపులు కాస్తుంటారు. పని దొరుకుతే పని ప్రదేశానికి వెళ్తారు. దొరకకపోతే 10 గంటలకు వరకు పని కోసం చూసి పనికి దొరకకపోతే చేసేదేమీ లేక ఇంటికి తిరిగి వెళ్ళిపోతారు. మేస్త్రీకి డిజైన్ చేసే మేస్త్రి 1200 రూపాయలు, ప్లాస్టరింగ్ చేసే మేస్త్రికి వెయ్యి రూపాయలు, ఇటుక పెట్టే మేస్త్రికి 800 రూపాయలు ఇస్తున్నారు. సిమెంటు కంకర ఇసుక కలిపే కూలికి 800 రూపాయలు ఇటుక మోసే కూలికి 600 రూపాయలు ఇస్తున్నారు. దీంతో 8 గంటల పనికి ఒక మేస్త్రికి 1500 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 1200 రూపాయలు ఇవ్వడంతో 300 రూపాయలు మేస్త్రి నష్టపోతున్నాడు. సిమెంటు కంకర కలిపే కూలి కి 700 ఒక చోట 600 ఒక చోట ఇష్టం వచ్చినట్లుగా ఇస్తున్నారు. రోజు 200 రూపాయలు నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేయించుకుంటున్నా పనికి తగ్గ కూలి ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు.

కూలీలను దోచుకుంటున్న బ్రోకర్లు

ఊర్లలో పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారం కావడంతో దినసరి కూలీ మేస్త్రీలు పొర కాళ్ళ రోజువారీ జిల్లా కేంద్రానికి రెండువేల మందికి పైగా వస్తున్నట్లు సమాచారం. జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 22 వేల పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పైగా ప్రధాన



జిల్లా కేంద్రంలో పని కోసం అడ్డా మీద ఎదురుచూస్తున్న కూలీలు

అడ్డాల వద్ద కూలి కోసం ఉండడం బ్రోకర్లు గుంపులు గుంపులుగా ఉన్న ప్రాంతానికి వెళ్లి దినసరి కూలీ రేటు మాట్లాడుకుని పని ప్రదేశానికి తీసుకెళ్తున్నారు. 8 గంటల బదులు 9 గంటల పని చేయించుకుంటున్నా కూలీ మాత్రం అరకొరే చెల్లిస్తున్నారు. పనికి వెళ్లకపోతే ఆ కూలీ సైతం రాకపోతే కుటుంబ పోషణ భారంగా మారుతుందని వెళు తున్నారు. కార్మిక లేబర్ చట్టం ప్రకారం ప్రధాన కూడలి వద్ద మేస్త్రీలకు కంకర సిమెంట్ కలిపే వారికి ఎంత కూలి అనేది బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో భవన నిర్మాణం చేపట్టేవారు యజమానులు వారి ఇష్టం సారంగా దినసరికి కూలీలకు డబ్బులు ఇవ్వడంతో ఏమి మాట్లాడలేకపోతున్నారు.

ఉదయం జిల్లా కేంద్రంలో చేరాలంటే 6 గంటలకే ఇంటి నుంచి బయలుదేరాల్సి ఉంటుంది. తిరిగి పని అయిపోయిన తర్వాత ఇంటికి చేరాలంటే రాత్రి 9 గంటలవుతుంది. ఉదయం చాయ్ తాగి మధ్యాహ్నానికి భోజనం కట్టుకొని వస్తే సాయంత్రం వరకు పనిచేస్తే అలసిపోతున్నారు. పల్లెల్లో పనులు లేక జిల్లా కేంద్రంలో వస్తే ఒకవైపు బ్రోకర్లు మరోవైపు భవన్ నిర్మాణం చేపట్టే నిర్వాహకులు పనికి తగ్గ కూలీ ఇవ్వలేకపోతున్నారు.

పొద్దంతా పనిచేసిన 400 మిగులుతుంది

రమేష్. భాగిర్తపల్లి



అడ్డామీదకు వచ్చి పొద్దంతా పనిచేస్తే 400 మిగులుతుంది. బస్సు, ఆటో కిరాయిలు, టిఫిన్ ఖర్చులకు ఉన్న డబ్బులు అయిపోతున్నయ్. కనీస కూలీ కూడా పడుతలేదు. ఎక్కువ రేటు అడిగితే పనికి వద్దంటున్నారు. కనీస రేట్ ఫిక్స్ చేసి బోర్డులు ఏర్పాటు చేస్తే మాకు మేలవుతుంది.

తక్కువ కూలీ ఇస్తుండ్రు

సాయిలు. సజ్జనపల్లి



9 గంటల నుంచి ఐదు గంటల వరకు పని చేపించుకొని 600 రూపాయలు ఇస్తున్నారు. పని ఎక్కువ చేసినా పైసలు అడుగుతే ఇస్తలేరు. సిమెంటు కంకర కలిపితే 800 రూపాయలు ఇవ్వాలి కానీ 600 ఇస్తున్నారు. బస్ కిరాయి ఖర్చులు పోను 500 మిగులుతున్నాయి.

అడ్డాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తాం

సురేందర్. జిల్లా లేబర్ అధికారి

దినసరి కూలీలు నష్టపోకుండా ప్రధాన కూడలి వద్ద రోజువారి అడ్డాల వద్ద త్వరలో బోర్డులు ఏర్పాటు చేస్తాము. మేస్త్రీలు, దినసరి కూలీలు బ్రోకర్ల బారిన పడితే మేస్త్రి వాళు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- బీఆర్‌టీయూ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు మిర్జా అయాజ్ బేగ్

నవతెలంగాణ-తాడ్వాయి



కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్‌టీ యూ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు మిర్జా అయాజ్ బేగ్ తెలిపారు. సోమవారం మేడేను పురస్కరించుకుని నవతెలంగా ణతో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఎద్దైనా ప్రమాదం జరిగితే వెంటనే స్పందిస్తాం. వారికి ఎలాంటి వసతులైనా, ఇంకేమైనా అవకాశాలు ఉంటే సమకూర్చే విధంగా చూసుకుంటాం. కార్మికులు ఎవరైనా మరణిస్తే రూ.5లక్షలు ఆర్థిక సహాయాన్ని ఇప్పిస్తాం.

అలాగే వారి కుటుంబంలో ఒకరికి పని కల్పిస్తాం. కార్మికుల సమస్యల పట్ల ముందుండి పోరాడుతాం. కమిషనర్ దృష్టికి తీసుకెల్లి పరిష్కరించేలా చేస్తాం. కార్మికులకు ఎల్లవేళలా యూనియన్ తరపునా అండగా ఉంటాం.

కార్మిక సమస్యలపై అలుపెరగని పోరు

- మోడీ సర్కారు విధానాలతో ఆగాధంలోకి కార్మిక వర్గం
- జిల్లాలో పోరాటంలో ముందంజ
- సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నుర్జహాన్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో చేపట్టిన ఆశా, అంగన్‌వాడీ సమ్మెలు విజయవంతమయ్యాయని తెలిపారు. కార్మిక, కర్షక ఐక్యత కోసం కృషి చేయడమే కాకుండా కార్మిక సంఘాలన్నింటినీ ఒకే వేదికపై తీసుకొచ్చి కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు మోపడమే కాకుండా... కార్మికుల కనీస హక్కులను కాలరాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా మే1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు వివరించారు. ఈ వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నుర్జహాన్ ప్రత్యేక ఇంటర్వ్యూ....



మాట్లాడుతున్న నూర్జహాన్

నిజామాబాద్ జిల్లాలో కార్మికోద్యమ పరిస్థితి ఎలా ఉంది?

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చింది. ఫలితంగా కార్మికులకు కనీస హక్కుల కరువయ్యాయి. దీంతో అనేక రంగాల కార్మికులు ఉద్యమాల్లోకి వస్తున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరాటాల్లోకి దిగుతున్నారు. దీనికితోడు నిత్యవసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వేతనాలు పాతాళంలోకి దిగజారుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో బీడీరంగ కార్మికులకు ఉపాధి కరువయ్యింది. కనీసం 15 రోజులు కూడా ఉపాధి లభించడం లేదు. జీఎస్టీ విధించడంతో వర్ధి బీడీని ప్రోత్సహిస్తున్నారు. దీనివల్ల కార్మికులకు పీఎఫ్ వర్తించడం లేదు. కోప్టా సవరణ చట్టం వల్ల బీడీరంగం పూర్తిగా కుదేలవుతోంది. లేకపోతే కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. గ్రామపంచాయతీ కార్మికులకు చాలా నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. అనేక దఫాలుగా ఉద్యమాలు చేసినప్పటికీ.. ఉద్యోగ భద్రత కరువయ్యింది. వేతనాలు లేక ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి ఉంది. ఈ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం కబుర్లు చెబుతోంది తప్ప ఆచరణలో పాటించడం లేదు. జిల్లాలో ఆశా వర్కర్ల పోరాటం రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. జిల్లాలో వర్కర్లు చేపట్టిన 8 కిలోమీటర్ల పాదయాత్రతో రాష్ట్రవ్యాప్తంగా కదలిక వచ్చింది. అంగన్‌వాడీలు సైతం 48 గంటల పాటు కలెక్టరేట్ వద్ద సమ్మె చేపట్టారు. మహిళలు రాత్రనక, పగలనక శిబిరంలో నిరసన కొనసాగించారు.

బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాల అమలు ఎలా ఉంది? కార్మికులకు ప్రయోజనం జరుగుతుందా?

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అందరికీ అచ్చేదిన్ వస్తుందని నమ్మబలికారు. కానీ ఇప్పుడు అచ్చేదిన్ కాస్త సచ్చేదిన్‌గా మారాయి. కార్మికుల పని గంటల విషయంలో, 29 కార్మిక చట్టాల రద్దులో తీవ్ర అన్యాయం జరిగింది. దీనికితోడు కనీస హక్కులపై మాట్లాడొద్దని, సమ్మె చేయొద్దని, ఉద్యోగ భద్రత అడగొద్దని సవాలక్ష నిబంధనలు ముందుకు తీసుకొస్తుంది. ఇక కార్మికుల త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానం మార్చేశారు. కనీస వేతనాలు ఇవ్వాలని కోర్టు చెబుతున్నప్పటికీ.. అమలు చేయడం లేదు. కోర్టు తీర్పు అమలు చేయకుండా ఉన్న వేతనాలు తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఇక కార్మికుల్లో విషపూరితంగా మతోన్మాదం పెంచి పోషిస్తోంది. కార్మిక ఐక్యతను దెబ్బతీసే కుట్రలకు తెరలేపుతోంది.

జిల్లాలో భవిష్యత్తులో ఏయే రంగాల్లో కేంద్రీకరించి ఉద్యమాలు చేయనున్నారు?

జిల్లాలో లక్షలాది మంది బీడీ రంగ కార్మికులున్నారు. ప్రయివేటు రవాణా రంగంలో వేలాది మంది ఉన్నారు. భవన నిర్మాణ రంగంలోనూ కార్మికులు అత్యధికంగా ఉన్నారు. కానీ ఈ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్కారు దృష్టి కేంద్రీకరించడం లేదు. పైగా మున్సిపాల్టీ, పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదు. పశుమిత్ర కార్మికులదీ అదే పరిస్థితి. మిషన్ భగీరథ కార్మికులు రోడ్డునపడుతున్నారు. ఈ రంగాల కార్మికుల సమస్యలపై కేంద్రీకరించి ఉద్యమాలు నిర్వహిస్తాం.

కార్మిక, కర్షక ఐక్యత కోసం జిల్లాలో మీరు చేసిన కృషి. చేపట్టిన ఉద్యమాలు.?

ఢిల్లీలో జరిగిన వ్యవసాయ రైతుల పోరాటాలకు సంఘీభావంగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక దఫాలుగా పోరాటం నిర్వహించాం. ఫలితంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికుల పోరాటాలకు రైతులు భజం-భుజం కలిపి ముందుకు నడిచారు. అలాగే ఇతర కార్మిక సంఘాలతోనూ కలిసి ఐక్య వేదిక నిర్మించి ఉద్యమాలు చేపడుతున్నాం.

కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణ్

నవతెలంగాణ-తాడ్వాయి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణ్ తెలిపారు. సోమవారం మేడేను పురస్కరించుకుని నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించాలి. పొరుగు రాష్ట్రాల మాదిరిగా జీతాలు చెల్లించాలి. మోడీ ప్రభుత్వం కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. కార్మికులందరికీ రూ.5000 పెన్షన్ అమలు చేయాలి.

వారం రోజుల పాటు మేడే ఉత్సవాలు

- విజయవంతం చేయండి :

సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్

చారిత్రాత్మకమైన మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మే ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు నిర్వహించే మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. 1886లో చికాగో నగరంలో జరిగిన మహత్తరమైన పోరాటంలో అనేకమంది కార్మికులు బలిదానం అయ్యారని గుర్తు చేశారు. దాని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించడం జరిగిందని అన్నారు. ఈరోజు దేశంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని, త్యాగాలు చేసి సాధించుకున్న ఆ హక్కును హరించడంకోసం ప్రయత్నం చేస్తుందని అన్నారు. నాలుగు రకాల లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి ఉన్న హక్కులు, కనీస మద్దతు ధరలను తీసేందుకుకోసం ప్రయత్నం జరిగిందని అన్నారు.

దానికి వ్యతిరేకంగా చారిత్రాత్మక రైతు పోరాటం జరిగిందని గుర్తు చేశారు. ఆ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి కొట్టినప్పటికీ వాటిని మరో రూపంలో తీసుకువచ్చేసి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. హక్కు కావాలని ఆనాడు వామపక్షాలు యూపీఏ ప్రభుత్వంతో ఉపాధి హామీ పథకాన్ని పని గ్యారెంటీ చట్టాన్ని సాధించడం జరిగిందని అన్నారు. దాన్ని కూడా కుదించే



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ప్రజల మీద తీవ్రమైన బారాలను కేంద్ర ప్రభుత్వం మోపుతోందని అన్నారు. ఈ స్థితిలో వారం రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే కార్మికులు కర్షకులను కలిపి ఐక్యంగా రేపు రాబోయే కాలంలో మహా ఉద్యమాన్ని చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మే 1 నుంచి 7 వరకు జరిగే మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని, కార్మికులందరూ భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చామంతి లక్ష్మి కటారి రాములు, కృష్ణ, నర్సయ్య, కొండ గంగాధర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బోధన్ :మే 1వ తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులకు సూచించారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా కోర్టు వద్ద ఉదయం 8 గంటలకు, సాలూర మండలంలో ఉదయం 9 గంటలకు మేడే ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, హమాలీలి కార్మికులు, బీడీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి సావిత్రి, దేరేడిలక్ష్మి, సాయిలు, హైమతి బేగం, అంజలి, పోశవ్వ, రమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనికి నిధులు పెంచాలి

- తెలంగాణ రైతు సంఘం

జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఉపాధి చట్టానికి నిధులు పెంచి వ్యవసాయ కూలీలకు 100 రోజుల పని కల్పించి కనీస వేతనం వచ్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడారు. దేశానికి వ్యవసాయమే వెన్నుముక అయినటువంటి పరిస్థితుల్లోనూ వ్యవసాయ కూలీలకు కనిసం ఉపాధి లేకుండా పోతుంది. రైతు కూలీలకు ఉపాధి హామీ బాసటగా నిలుస్తుంది అటువంటి తరుణంలోనూ ఉపాధి హామీ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దానికి తోడు ఉపాధి హామీ వంద రోజుల పని పథకం లో రైతు కూలీలకు కూలి పని దినాలు తగ్గిపోయాయి. 30, 40 రోజులే పని కల్పిస్తున్నారు. అంతకు మించి పని చేసుకునే పరిస్థితి లేదు. చేసిన పనికి కూలి చెల్లింపుల్లో రోజుకు 80, 90 రూపాయల చొప్పున పని దినములు అయిపోయిన 45 నుంచి 60 రోజుల వ్యవధిలో కూలి డబ్బులను చెల్లిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతు కూలీలకు పనులు లేక జీవనం కొనసాగించడానికి పట్టణాలబాట పడుతున్నారు. పట్టణాల్లో ఎక్కడ పని దొరుకుతుందో తెలియక నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద అడ్డాలపై ఉంటూ పనులకోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కనీసం ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా 100 రోజుల పనిదినాలను అమలు చేస్తూ పనిచేసిన వారంరోజుల్లోనే కూలి డబ్బులు చెల్లించాలని అన్నారు.

హక్కుల సాధన ఉద్యమమే మేడే

- ఏఐపీకేఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



హక్కుల సాధన ఉద్యమమే మేడే. నేడు హక్కుల సాధనకు నాటి అమరవీరుల త్యాగల మార్గంలో మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం. మేడే సందర్భంగా నవతెలంగాణ దినపత్రికతో మాట్లాడుతూ ప్రపంచ అభివృద్ధి, మానవాళి మనుగడకు, శ్రమే మూలం అనేది నగ్న సత్యం. వందల సంవత్సరాలు పెట్టుబడిదారులు శ్రమ దోపిడీ చేస్తూ, శ్రమించే వారి హక్కులను, వారి స్వేచ్ఛను, హరించి వేయడమే కాకుండా తమ పెట్టుబడికి, లాభానికి, శ్రమే మూలాధారం. శ్రమ చేసే కార్మిక వర్గం దినదిన చైతన్యం పొంది మేము మనుషులమే, మాకు హక్కులు కావాలి అంటూ ప్రశ్నించే గొంతుకలు అక్కడక్కడ నిరసనలు వ్యక్తం చేసి అణిచివేయబడ్డ రోజులవి అని. 138 సంవత్సరాల క్రితం అమెరికా చికాగో నగరంలో లక్ష మంది కార్మికులు 8 గంటల పని దినం కావాలంటూ వీధుల్లోకి వచ్చి పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా గౌరవం కావాలని, హక్కులు సాధించుకోవడం కోసం వీరోచిత పోరాటం చేశారనే విషయాన్ని మరువలేనిది. ఈ నేపథ్యంలో ఈ పోరాటంలో కార్మికుల పైన పెట్టుబడిదారీ వ్యవస్థ, కాపాల దారులైన పోలీసులు దారుణంగా, విచక్షణ రహితంగా లాటిలు జులిపించడమే కాకుండా భయానకమైన పరిస్థితుల్ని సృష్టించి కాల్పులు జరిపారు. అక్కడికక్కడే 8 మంది కార్మికులు రక్తం మడుగులో తమ ప్రాణాలు వదిలే గడియల్లో తమ ఒంటిపై ఉన్న చొక్కాలను చింపి రక్తమడుగులో ముంచి ఇదే మన కార్మికుల జెండా అని ఎగరవేసిన రోజే మేడే.గాయాల పాలైన మరో ఏడుగురు ఆత్మ త్యాగాలు చేసి ప్రపంచ కార్మికులను ఐక్యం చేసిన వీరోచిత పోరాటమే మేడే.నాటి అమరవీరుల కు నివాళులర్పించడం అంటే నేటి పెట్టుబడు దారి, భూస్వామ్య అవశేషాలు గల భారతదేశంలో, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటమే నిజమైన నివాళి అని గుర్తుంచుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా పండగలు వేరువేరుగా చేసుకుంటారు కానీ ప్రపంచవ్యాప్తంగా ఒకే ఒక్క పండగ హక్కుల ప్రతిజ్ఞ రోజే మే డే (కార్మికుల పండుగ దినం). ఈ నేపథ్యంలో పెట్టుబడి దారి వ్యవస్థను బలోపేతంగా చేసే బిజెపి మతోన్మాద సర్కార్ అనేక త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను, ఒక కలం పోటుతో రద్దుచేసి నాలుగు కోడ్లుపేరుతో కార్మికుల పొట్టపై హక్కులపై దాడి చేస్తుంది. కార్మికులు అదనంగా పనిచేస్తే దేశానికి ప్రపంచ పెట్టుబడులు వస్తాయని కథలు బోధిస్తున్న ఈ సర్కారును నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవసాయ రంగంలో యంత్ర పరికరాల ప్రవేశంతో గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం పెరిగింది. ఉద్యోగాలు, ఉపాధి, సాగు భూములు ఇవ్వండి అంటూ చేసిన పోరాటాలు ఫలితమే ఆనాటి ప్రభుత్వం 2005 ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉపాధి పథకాన్ని రద్దు చేసే దిశలో ప్రతి సంవత్సరం బడ్జెట్ లో కోత పెడుతూ వ్యవసాయ కూలీలకు కొత్త నిబంధనల పేరుతో పొమ్మన లేక పొగ పెట్టే విధంగా ఉపాధి కూలీలపై నిర్బంధ విధానాల్ని ప్రవేశపెడుతుంది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు వారి గుప్పిట్లో బంధించడానికి చేసే బిజెపి ప్రయత్నాలను మేడే అమరవీరుల స్ఫూర్తితో కాపాడుకుందాం.. మే డే స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు, ఉన్న హక్కులను కాపాడుటకు ఎర్రజెండా చేతబూని ఐక్య ఉద్యమాలు చేద్దాం.

కార్మికుల బతుకులు మారేనా?

- నేడు కార్మికుల పండుగ రోజు మే డే

ప్రతి సంవత్సరం మేడే జరుపుకుంటున్న కార్మికుల జీవితాల్లో నేటికీ వెలుగులు లేవు. ప్రైవేటీకరణ, ఆధునీకరణ కాంట్రాక్టు పద్ధతి లాంటి విధానాల వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. కష్టాలు, కన్నీళ్ల బతుకులు ఎప్పటికీ మారడం లేదు. ఉన్నవారికి ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనాలు అందడం లేదు. కార్మిక చట్టాలున్న అమలుచేసే యంత్రాంగం కనిపించలేదు. కార్మికుల బతుకులు నానాటికి చితికి పోతున్నాయి.

నవతెలంగాణ-ఆర్మూర్

అమెరికాలోని చికాగో నగరంలో పని గంటల పరిమితి కోసం కార్మికులు రక్తతర్పణంచేసి ఆ రక్తంలో తడిసిన ఎర్రజెండాను నేడు గుర్తు చేసుకుంటున్నాం. ఆ కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ కార్మిక కర్షక వర్గాలు ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 1889లో చికాగో నగరంలో మే ఒకటవ తేదీన కార్మిక లోకం ఉద్యమించింది. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా వేలాదిమంది కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. రోజుకు ఎనిమిది గంటలు పని మాత్రమే ఇవ్వాలని నినదించారు. వారు చేస్తున్న ఆందోళనలో పోలీసులు విరుచుకుపడి వందలాది మంది కార్మికులు నేలకొరిగారు. రక్తంతో తడిసిన దుస్తులను జెండాలుగా చేసి వాడవాడలా ఎగురవేశారు. చివరకు ఈ పోరాటం ద్వారా 8 గంటల పని హక్కును సాధించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. చికాగో నగరంలో చిందిన రక్తం ఎర్రజెండాగా మారి ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచింది. నాటి స్మృతులను స్మరిస్తూ కార్మికుల్లో ఐక్యత స్ఫూర్తిని చాటుతూ ప్రపంచ వ్యాప్తంగా మే డే ఉత్సవాలు చేయడం ప్రారంభించారు. కుల, మత, వర్గం, వర్ణం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రపంచ వ్యాప్తంగా సమైక్యంగా


జరుపుకునే పండగ మేడే ఒక్కటే.

కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ అన్ని చట్టాలను తమ పార్టీకి మద్దతు ఇస్తున్న కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తున్నారు. మోడీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ ప్రైవేటీకరణ వేగవంతం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ధరలను తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వాలు గ్యాస్, పెట్రోల్, డీజిల్, వంటనూనె, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటున్నాయి..

ఉమ్మడి జిల్లాల్లోనూ...

ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది కార్మికులు ఉన్నారు .వీరు సంఘటిత శక్తిని చాటడానికి సంఘాలుగా ఏర్పడ్డారు. బీడీ వర్కర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, మున్సిపల్ కార్మికులు, రిక్షా, ఆటో కార్మికులు తదితర రంగాలలో జీవనం సాగిస్తున్నారు. వీరిలో 80 శాతం మించి రోజువారి కష్టపడితే తప్ప ముద్ద దిగని అభాగ్యులు ఎందరో ఉన్నారు. గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారు ఎందరో ఉన్నారు. వీరి బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఇంకా ఎన్నేళ్లు పడతాయో వేచి చూడాల్సిందే.

వెట్టిలో మగ్గుతున్న బాల కార్మికులు...

ఉమ్మడి జిల్లాలోని వేలాది బాల కార్మికులు వేటి లో మగ్గుతున్నారు. బాల కార్మికులు కిరాణం షాపులు, హొటల్లు, ఇటుక బట్టి, భవన నిర్మాణ రంగంలో పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. బిక్షాటన చేస్తున్న చిన్నారులు ఎందరో ఉన్నారు. ఇలాంటి మేడేలు ఎన్ని వచ్చి పోతున్న వారి బతుకుల్లో మార్పు రావడం లేదు. ప్రజా ప్రతినిధులు స్వలాభమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ప్రపంచంలో సంపద సృష్టికర్తలు కార్మికులే అన్న విషయాన్ని పాలకులు గుర్తించే రోజులు ఎప్పుడొస్తాయో మరి.

మేడే స్ఫూర్తితో మనువాద సర్కారుపై పోరు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

- కామారెడ్డి జిల్లాలో కార్మికులకు ఉపాధి కరువు
- పని కోసం ఇతర దేశాలకు, ప్రాంతాలకు వలస
- కార్మికులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- బీడీ, హమాలీ, రవాణా, నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై ఆందోళనలు
- సీఐటీయూ కామారెడ్డి జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికుల త్యాగాలను స్మరించుకనే మేడే స్ఫూర్తితో కేంద్రంలోని మనువాద బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ కామారెడ్డి జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత యజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తూ కార్మికుల కనీస హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని కార్మికులకు ఉపాధి కరువయ్యిందని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా వాసులు ఉపాధి కోసం హైదరాబాద్, ముంబాయి లేదా గల్ఫ్ బాట పడుతున్నారని వివరించారు. జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చేయడం లేదని, ఉన్న కొన్ని పరిశ్రమల్లోనూ ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తున్నారని వాపోయారు. మేడే స్ఫూర్తితో కామారెడ్డి జిల్లాలో భవిష్యత్తులో బీడీ, హమాలి, రవాణా, నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని వివరించారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ చంద్రశేఖర్ ప్రత్యేక ఇంటర్వ్యూ....

జిల్లాలో కార్మికుల పరిస్థితి ఎలా ఉంది? ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయా?

కామారెడ్డిలో కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. జిల్లాలో ఉపాధి అవకాశాలు లభించడం లేదు. ఉపాధి కోసం హైదరాబాద్, ముంబాయితో పాటు దుబాయి తదితర గల్ఫ్ విదేశాలకు వలస వెళ్తున్నారు. జిల్లాలో పరిశ్రమలు, కంపెనీలు లేవు. భిక్కనూర్ ప్రాంతంలో కొంతమేర ఉన్నా.. యంత్రాల వినియోగం ఎక్కువగా ఉంది. ఇక మిగిలిన అరకొర పని చేసేందుకు సైతం జిల్లాలో స్థానికులకు అవకాశం కల్పించకుండా యూపీ, బిహార్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొస్తున్నారు. ఉపాధిపై పాలక ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదు.

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం.. కార్మికుల చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. దీనివల్ల కార్మికులకు ప్రయోజనం కలుగుతుందా?

సులభతర వాణిజ్యం పేరిట ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నమ్మబలికి కేంద్రంలోని మోడీ సర్కారు.. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చింది. కార్మికుల సంక్షేమం గాలికొదిలి పూర్తిగా యజమాన్యాలకు కేంద్రం తొత్తుగా వ్యవహరిస్తోంది. ఏ రంగంలోనూ కనీస వేతనాలు అమలు కావడం లేదు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేదు. కామారెడ్డి జిల్లాలో మెజార్టీగా బీడీ రంగంపై ఆధారపడి పని చేస్తున్నారు. మోడీ సర్కారు యజమాన్యాలతో కుమ్మక్కై లక్షలాది మంది కార్మికులను రోడ్డున పడేసింది. 28 శాతం జీఎస్టీతో ఈ రంగాన్ని పూర్తిగా కుదేలు చేశారు. బీడీలు తాగడం వల్ల చనిపోయినట్టు చరిత్రలో లేదు. కానీ బీడీ కట్టలపై పుర్రెగుర్తులు ముద్రించి బీడీ మార్కెట్‌ను దెబ్బతీశారు. బీడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని జీఓ 41 వస్తే.. దాన్ని అమలు చేయకుండా మళ్లీ జీఓ 81 తీసుకొచ్చారు. బీడీ కార్మికులతో పాటు చటాన్, ప్యాకర్లు, టేకేదార్లు ఇలా అందరూ నష్టపోయారు. బీడీ రంగం ఇంతగా దెబ్బతిన్నా ఏ యజమాని నష్టపోలేదు. కార్మికుల శ్రమను దోచుకుంటూ యజమాన్యాలు ఇప్పటికీ లాభాలు గడిస్తున్నాయి. సంవత్సరంలో 180 రోజులు పని ఉంటేనే పీఎస్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు లభిస్తాయి. దీంతో యజమాన్యాలు ఉద్దేశపూర్వకంగా 120 రోజులు మాత్రమే పని కల్పిస్తూ కార్మికులకు దక్కాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలను అందనీయడం లేదు.

కామారెడ్డిలో సీఐటీయూగా చేపట్టిన ప్రధాన ఉద్యమాలు ఏంటి?

జిల్లాలో సీఐటీయూగా రెండు లక్ష్యాలు విధించుకుని కృషి చేశాం. మొదటిది పని ప్రదేశాల్లో కార్మికుల హక్కులు కాపాడటం. నివాస ప్రాంతాల గురించి కృషి చేయాలని నిర్ణయించాం. షుగర్ ఫ్యాక్టరీ, మద్నూర్ జిన్నింగ్ మిల్, నిర్మాణ రంగ కార్మికుల సమస్యలతో పాటు అంగన్‌వాడీ, ఆశా, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టాం. నివాస ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు కోసం రెండు మూడు ప్రాంతాల్లో సీఐటీయూగా ఉద్యమాలు చేపట్టాం. కొంతమేర విజయం కూడా సాధించాం.

మేడే సందర్భంగా భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలు ఏంటి? కార్మికులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

కేంద్రంలోని మోడీ సర్కారు అంతర్జాతీ కార్మికుల దినోత్సవాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఆనాడు శ్రమ దోపిడీకి వ్యతిరికంగా, ఎనిమిది గంటల పని విధానం కోసం కార్మికులు తమ రక్తం ధారపోశారు. కానీ నేడు మోడీ సర్కారు మేడేను విశ్వకర్మ జయంతి అని కొంతమందికే పరిమితం చేయాలని చూస్తోంది. ఇక కార్మిక చట్టాలను పూర్తిగా యజమానులకు అనుకూలంగా మార్చేసింది. ఓ వైపు కనీస వేతనాలు అమలు కావడం లేదు. మరోవైపు నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా కార్మికులపై అదనపు భారం పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేడే స్ఫూర్తితో కేంద్రంలోని మనువాద సర్కారుపై కార్మికులు సంఘటిత పోరాటాలు చేయాలి. జిల్లాలో రవాణా, బీడీ, నిర్మాణ రంగం, హమాలి కార్మికుల సమస్యలపై భవిష్యత్తులో కేంద్రీకరించి పోరాటాలు నిర్వహిస్తాం.

హమాలీ కంటే అధ్వానం

- విద్యుత్ శాఖలో ఏండ్లుగా వెట్టిచాకిరీ
- స్టోర్ కార్మికుల గోడు పట్టని యాజమాన్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ





విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కార్మికులు అందరి కుటుంబాల్లో వెలుగు నింపుతునన్నారు. విద్యుత్ శాఖ స్టోర్ హమాలీల కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగు నింపేది ఎప్పుడో అని ఏన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. అయినా వారి జీవితాల్లో నేటికీ ఏ మార్పు జరగలేదని, ఏదో ఒక రోజు మార్పు వస్తుందని సంవత్సరాలు హమాలీలుగా పనులు చేస్తున్నారు.

నిజామాబాద్ నగరంలోని విద్యుత్ శాఖలో ఒక్కో కార్మికుడు 17 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల అవుతున్న హమాలీ కార్మికులుగా 16 మంది పనిచేస్తున్నారు. గతంలో ఎందరో మంది కార్మికులు పని చేసి వెళ్లిపోయినప్పటికీ వారి తండ్రుల స్థానంలో అదే శాఖలో అక్కడే హమాలీ కార్మికులుగా పనిచేస్తున్నారు. వారు చేసే పనికి రోజువారి ఖచ్చితమైన కూలీ ధర లేదు. ఒక్కో వస్తువుకు ఒక్కో ధర ప్రభుత్వం నిర్ణయించిన ధర ఉంటుంది. వస్తువుల లోడింగ్‌కు ఒక ధర, అన్ లోడింగ్‌కు మరో ధర ఉంటుంది. వారు చేసే లోడింగ్ అన్ లోడింగ్ ఆధారంగా ధర నిర్ణయించారు. ఆ పద్ధతిలోనే వారు నెల మొత్తంలో చేసిన పనికి ఒక ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా లెక్కలు వేసి జరిగి న పనికి బిల్లు చెల్లిస్తారు. ఆ మొత్తం బిల్లులో 16 మంది కార్మికులు పంపిణీ చేసుకుంటే ఒక్కోక్కరికి వారికి నెలకు 8000 నుండి 11 వేల వరకు మాత్రమే కూలి పడే అవకాశం ఉంటుంది.

విద్యుత్ శాఖ హమాలీలు ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్ట్ర (వైర్), కేబుల్, క్లాంపులు, క్రాసర్లు, ఇన్సులేటర్లు లోడింగ్ అన్లోడింగ్ చేస్తారు. వీటన్నింటికీ ఒక్కోదానికి ఒక్కో ధర నిర్ణయించి హమాలీలకు బిల్లు చెల్లించడం జరుగుతుంది. కానీ ఈ హమాలీ కి కూడా పిఎఫ్, ఈఎస్ఐ లేదు. కనీసం ప్రభుత్వం ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించి హమాలీలుగా నైనా గుర్తించాలని వారు కోరుకుంటున్నారు.

ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ 350 కేజీల నుండి 1800 కేజీల వరకు బరువు ఉంటుంది. ఈ బరువులను మోయడానికి ఈ కూలీలందరూ కూడా సరిపోకపోవడంతో వారే ప్రత్యేకంగా బరువు ఎత్తడానికి దింపడానికి క్రేన్‌ని ఉపయోగించి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనాలలో ఎక్కించడం, దించడం చేస్తారు. దానికి కూడా ప్రభుత్వం ఒక ధర నిర్ణయించింది ఆ ధార ప్రకారమే బిల్లు చెల్లిస్తారు.

కార్మికులకు పనిదినం.. 8 గంటలే

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కార్మికులకు 8 గంటల పని దినంకోసం 136 సంవత్సరాల క్రితమే పోరాటం చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటలను పెంచుతూ కార్మికులకు ఇబ్బందులను గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఒకే తాను ముక్కలు. మే డే సందర్భంగా నవ తెలంగాణ పత్రికతో మాట్లాడుతూ కార్మికులు 8 గంటల పని చేయడానికే ఎన్నో పోరాటాలుచేసి సాధించుకున్నారు. అటువంటిది దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు 8 గంటల పనిదినాలు 12 గంటలకు పెంచుతున్నారు. 44 చట్టాలను నాలుగుకోడ్లుగా మర్చి కార్మికులకు పని భారాన్ని పెంచుతూ పెట్టుబడిదారీ యజమానులకు అనుకూలంగా నాలుగు తయారు చేస్తున్నారు. తద్వారా కార్మికులకు పని భారం, ఒత్తిడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కేంద్రప్రభుత్వం ఫ్యాక్టరీలలో పరిశ్రమలలో పెట్టుబడిదారీ యజమానులవద్ద కార్మికులు 12 గంటల పాటు పనిచేసే విధంగా చట్టాలను తయారు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సముదాయాలను వ్యాపారాలను పరిశ్రమలను 24 గంటలు తెరిచి ఉంచుకునే విధంగా చేస్తుండటంతో కార్మికులకు పని ఒత్తిడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే కార్మికులకు 12 గంటలకు 24 గంటలు పని దినాన్ని కాకుండా ఎనిమిది గంటలు చేయాలి. ఎనిమిది గంటల పని దినం కోసం మరో పోరాటానికి సమయం ఆసన్నమవుతుంది.

నేడు కార్మిక ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

138వ మేడే సందర్భంగా కార్మికులందరికీ కనీస వేతనాలు పెంచి అమలు చేయాలని, ఉద్యోగ సామాజిక భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ డిమాండ్ చేశారు. పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నేడు ఉదయం 11.30 గంటలకు రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి మున్సిపల్ కార్యాలయం (ధర్నాచౌక్) వరకు కార్మిక ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ, సభ నిర్వహించనున్నామని, కావున కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మతి చెందిన పైతరి గంగరాజు కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ తరపున 5 వేల రూపాయలు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి రూ.5వేలు, మద్ది కష్ణం రూ.5వేలు, మద్ది సూర్యకాంత్‌రెడ్డి రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ చేపూరి రాజు, యూత్ అధ్యక్షుడు సామ రాకేష్ రెడ్డి, ఏనుగు చిన్న భూపతిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరగబడిన నిఘానేత్రం



నవతెలంగాణ-బోధన్

ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్ డిపోకు సూపర్ లగ్జరీ బస్సులను కేటాయించారు. హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు ఈ సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నారు. ఈ బస్సులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులో నిరంతరం పర్యవేక్షించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే డ్రైవర్ ఎదురుగా ఉన్న సీసీ కెమెరా ప్రయాణికులు ఎక్కవలసిన డోర్ వైపు చూపించాల్సి ఉంది. కానీ ఆ కెమెరా పైకి తిరగబడి ఉంది. అయినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. ప్రయాణికులు బస్సు ఎక్కుతున్న సందర్భంలో ఏవైనా ఘటన జరిగితే తెలియకుండా పోయే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి సీసీ కెమెరాలు సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొలకెత్తిన ధాన్యం

- వారం నుంచి నిత్యం వర్షం, ఈదురుగాలులు
- తీవ్రంగా దెబ్బతిన్న వరి, ఇతర పంటలు, పశుగ్రాసం

ఉమ్మడి జిలాల్లో వారం రోజుల నుంచి నిత్యం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో వరితో పాటు ఇతర పంటలు, పశుగ్రాసం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈదురుగాలులకు వడ్లు నేలరాలాయి. వరి పంట నేలకొరిగింది. ఇక కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి మొలకెత్తింది. వరి పంట కోసిన రైతులు వారం నుంచి ఎండ రాగానే ధాన్యాన్ని ఆరబెట్టడం.. వర్షపు చినుకులు రాలగానే వడ్లు కుప్పచేయడం సాధారణమైంది. వరి ధాన్యం కోయని రైతులు ఈదురుగాలులకు వడ్లు రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు మండే ఈ నెలలో అకాల వర్షాలు పడి పంట నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

నసురుల్లాబాద్ : బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది. 80 శాతం వరి కోతలు పూర్తి కాగా మిగతా కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వడగండ్ల వానతో 4 వేల ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. నసురుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్, దుర్కి, సంగెం, నసురుల్లాబాద్, నెమ్లి, అంకోల్ గ్రామాల్లో ధాన్యం మొలకెత్తింది. గత కొన్ని రోజులుగా ముసురు తగ్గకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒకే తీరు ముసురు ఉండడంతో ధాన్యం తడవకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ప్రతిరోజు రప్పించుకున్న కూలీలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వస్తున్న ఎండకు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, తిరిగి సాయంత్రం వేళలో ఒకే దగ్గరికి చేర్చి తడవకుండా పట్టాలు కప్పుతున్నప్పటికీ నీటి నిలువలతో వరి ధాన్యం మొలకెత్తుతోంది. ముఖ్యంగా ఇలాంటి పనులు చేయడానికి కూలీల డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముసురులో కూలీలు రాకపోవడంతో కుటుంబ సభ్యులే వర్షంలో తడుస్తూ ఎండుతూ ధాన్యం వద్ద ఉంటున్నారు. రైతుల సౌకర్యార్థం నిర్మించిన గోదాములోకి ధాన్యం తరలించాలని, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నసురుల్లాబాద్ :తూకం వేసిన ధాన్యం బస్తాకు మొలకలు

అకాల వర్షానికి రైతుల విలవిల..

పిట్లం : వారం రోజుల నుంచి కురుస్తున్న వాడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతినడంతో పాటు కళ్ళల్లో పంటలు తడిసి ముద్దవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు కరేగావ్, కరేగావ్ తండా, ధర్మారం, అన్నారం, తిమ్మనగర్, హస్నాపూర్, చిన్నకొడప్‌గల్‌లో ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల వర్షం దాటికి వరి పంట నెలకొరిగింది. వడ్లు రాలిపోయాయి. కళ్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం, మొక్కజొన్న పంట తడిసిపోయింది. దీంతో రైతులు కంటతడి పెట్టారు. అలాగే మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ముందుగల ఎండిపోయిన చెట్లు నేలకొరిగాయి.

టార్పాలిన్లు ఇవ్వట్లే..

జుక్కల్ : మండల వ్యాప్తంగా వరి 2670 ఎకరాల్లో, మొక్కజొన్న 230 ఎకరాల్లో, పల్లి 460 ఎకరాల్లో, తెల్లజొన్న 1650 ఎకరాల్లో, పొద్దుతిరుగుడు 350 ఎకరాల్లో రైతులు సాగుచేశారు. అయితే గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న పల్లి, పొద్దుతిరుగుడు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం దాటికి పంట చేనులలో కోసిన కుప్పలు ఒక దగ్గర ఉంటే, పంట యంత్రాలతో వేసిన తరువాత ఎండబెట్టిన కుప్పలు, కోతకు వచ్చిన పంట ఒక వైపు ఉంది. పంట చేనులలో చేతికొచ్చిన ధాన్యం ఒక పక్క ఎండకు ఎండుతూ వానకు నానుతూ తెప్పలా తేలియా డుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేక రోడ్ల మీద ధాన్యం ఆరబెడితే అకాల వర్షం పంటన నాశనం చేస్తోందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. రైతులకు మార్కెట్ యార్డ్ నుంచి ఉచితంగా టార్పాలిన్లు పంటను కప్పేందుకు ఉచితంగా ఇవ్వాల్సి ఉన్నా. అధికారులు అవేమీ ఇవ్వడం లేదు. ప్రభుత్వం పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



జుక్కల్‌లో కళ్లాల్లోనే ధాన్యం



పిట్లం : పొలంలో నేలరాలిన ధాన్యం



మద్నూర్ : మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు



లింగంపేట్ : వర్షానికి కొట్టుకుపోయిన ఆరబెట్టిన ధాన్యం

మా గోస ఎవరికి చెప్పుకోవాలి..

మద్నూర్ : డోంగ్లి మండలంలోని మంజీరా నది పరివాహక గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరి ధాన్యం మొలకెత్తింది. మా గోస ఎవరికి చెప్పుకోవాలంటూ ఈలేగావ్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోంగ్లి మండలంలోని మదన్‌హిప్పర్గ, ఈలేగావ్, ఏనాబోరా, కుర్లా, ధోతి, సిర్పూర్ తదితర గ్రామాల్లో వరి ధాన్యానికి అకాల వర్షాలు భారీగా నష్టాన్ని కలిగించాయి. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టప రిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

లింగంపేట్ : మండలంలోని భవానిపేట్, జల్దిపల్లి, నల్లమడుగు, బోనాల్, శెట్పల్లి, సంగారెడ్డి, పోల్కంపేట్, పర్మల్ల, సజ్జనపల్లి, రాంపూర్, మంబోజిపేట, లింగంపల్లి, మెంగారం, కన్నాపూర్, కోమటిపల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. భవానీపేటలో సుమారు 100 ఎకరాలకు పైగా వరి ధాన్యం నేల రాలిందని రైతులు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం 10వేల క్వింటాళ్లకుపైగా తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి కొడుకుల మధ్య గొడవ

- ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్

భూమి విషయంలో తండ్రీ కొడుకుల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోగా.. కొడుకు ఏమన్న చేసుకుంటాడన్న మనస్థాపంతో తండ్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మోతే గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం.. మోతే గ్రామానికి చెందిన డిచ్‌పల్లి సాయిరెడ్డి (60)కు కూతురు, కొడుకు సంతానం. వాళ్లిద్దరి పెళ్లిల్లు కూడా అయ్యాయి. అయితే భూమి విషయంలో కొడుకును తండ్రి సాయిరెడ్డి మందలించాడు. కొడుకు మనస్థాపం చెంది చనిపోతానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. కొడుకు ఆత్మహత్య చేసుకుంటాడేమోనన్న మనస్థాపంతో సాయిరెడ్డి తన పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డికి తరలించారు. భార్య అమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ గొప్ప మహనీయుడు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

అంబేద్కర్ గొప్ప మహనీయుడని సలాబత్పూర్ అంజనేయ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ అలయ చైర్మన్ కాశీనాథ్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మహనీయుడని కొనియాడారు.ఈ జయంతి వేడుకల సందర్భంగా మద్నూర్ మండల్ యూత్ ఐకాన్ సచిన్ పటేల్‌కు అంబేద్కర్ యువజన సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నారాయణ రథోత్సవానికి రూ.21 వేలు విరాళం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం శ్రీలక్ష్మీ నారాయణ రథోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ రథోత్సవానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ డీజే లైటింగ్ ఏర్పాటు కోసం రూ.21 వేలు విరాళంగా రథోత్సవ కమిటీ గ్రామ పెద్దలకు ఆదివారం అందజేశారు. విరాళం అందజేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌కు రథోత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బండివార్ విజయ్ కుమార్, పాకల విజయ్, చోళవార్ హనుమాన్లు స్వామి, బొగ్గుల వార్ సంజు, గాండ్ల సంజు, అవార్వార్ హనుమాన్లు, కంచిన్‌వార్ నాగేష్, రథోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయానికి విరాళం అందజేత




విరాళం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ తల్లి దేవాలయానికి గ్రామానికి చెందిన బొమ్మెర గంగాధర్ - సుజాత దంపతులు వారి కుమారుడు రేవంత్ కుమార్ చేతుల మీదుగా రూ.28,260 నగదును ఆలయ కోశాధికారి కదిరె మోహన్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ అభివద్ధికి విరాళం అందించిన బొమ్మెర గంగాధర్ సుజాతకు అభినందనలు తెలియజేశారు. అందరి సహకారంతో అమ్మవారి ఆలయం ఇప్పటి వరకు చాలా అందంగా అభివద్ధి చేశామని, ఇంకా అమ్మవారి ఆలయ అభివద్ధికి దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ ఉపాధ్యక్షులు బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన



జమున రాథోడ్‌కు మెమోంటో అందజేస్తునదాలయ కమిటీ నిర్వాహకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్ల గ్రామంలో భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ట మహెూత్సవాన్ని తొగిట పీఠాధిపతి మాదానంద సరస్వతి చేతుల మీదుగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహెూత్సవానికి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్చార్జి జమున రాథోడ్, కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రజాప్రతినిధులకు శాలువలు కప్పి మెమోంటోలను అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిరిజన తండాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

గిరిజన తండాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్టీసెల్ విభాగ అధ్యక్షులు నౌసిలాలు నాయక్‌ను నియోజకవర్గంలోని మండలాల ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి ఎస్టీ సెల్ అధ్యక్షునిగా సర్దార్, నాగిరెడ్డిపేట్ మండలానికి గోపియా నాయక్, లింగంపేట్ మండలానికి వినోద్ నాయక్, గాంధారి మండలానికి గణేష్ నాయక్, తాడ్వాయి మండలానికి సూర్యనాయక్, సదాశివనగర్ మండలానికి రవి నాయక్‌ను అధ్యక్షులుగా నియమించారు. కార్యక్రమంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి మండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, భిక్కనూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఆఫీస్ తిరుపతిరెడ్డి, నిజంలతో పాటు అన్ని మండలాల గిరిజన నాయకులు పాల్గొన్నారు.



నియామకపత్రాలను అందజేస్తున్న దృశ్యం

వైభవంగా వాసవీమాత జయంతి వేడుకలు

నవతెలంగాణ-పిట్లం/గాంధారి

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆర్యవైశ్యుల కులదేవత వాసవీమాత జయంతి ఉత్సవాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి, వేద పండితులు ఆనంద్ పంతులు అమ్మవారి జీవిత చరిత్రను వివరించారు. అనంతరం మహిళలు భక్తి శ్రద్దలతో కుంకుమార్చనలు నిర్వహించి భక్తి గితాలాపణలు చేశారు. పెద్దఎత్తున మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిమాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి మాత ఉత్సవ విగ్రహాలను మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు చేసిన సాంప్రదాయ నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. భజన కార్యక్రమాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాంధారి : జయంతి ఉత్సవాల్లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు



సదాశివనగర్ : కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/సదాశివనగర్

భారత ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కీ బాత్ 100వ ఏపిసోడ్ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి బీజేపీ శాఖ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని ఎస్‌వీఆర్ కంప్యూటర్స్‌లో ఆదివారం వీక్షించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల పట్టణ నాయకులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూరు గ్రామంలోని బీజేపీ నాయకులు మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తున్న కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో మార్పులకు మన్ కి బాత్ శ్రీకారం చుట్టిందని అన్నారు. మన్ కి బాత్‌తో సామాన్యుల భావోద్వేగాలు ప్రధాని తెలుసుకున్నారని, తన ఆలోచనలను వారితో పంచుకున్నట్లు చెప్పారు. సామాన్యులకు సంబంధించి ప్రతినెల సందేశాలు చదివినట్లు తెలిపారు. అభివద్ధి, సంక్షేమం కార్యక్రమాలపై చర్చించినట్లు వెల్లడించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం బీర్కూర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో విశ్వకర్మ భగవాన్‌కు పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిలు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిలు, మొనప్ప, బ్రహ్మం, పండరీ, హనుమంతు, సత్యం, బస్వరాజు, ప్రకాష్, శశికాంత్, శంకర్ పాల్గొన్నారు.

బిచ్కుందలో భారీ వర్షం

- వీధులలో పేరుకుపోయిన బురద

నవతెలంగాణ-బిచ్కుంద



బస్టాండ్ ప్రాంతంలో నిలిచిన వర్షపు నీరు

బిచ్కుంద మండల కేంద్రంలో ఆదివారం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ ప్రాంతంలో, 15 వార్డు వీధులలో నీరు నిలవడంతో ఇండ్లలోకి నీరు చేరి వీధులన్నీ బురదమయంగా మారాయి. భారీ వర్షం పడడం అకస్మాత్తుగా వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో నివాసితులు అష్టకష్టాలు పడ్డారు. గత కొన్ని రోజులుగా గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు వీధులలోని మురికి కాలువలు శుభ్రం చేయడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ ప్రాంతం చెరువులా మారడంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు అష్టకష్టాలు పడుతూ మోకాలు వరకు పేరుకుపోయిన చెత్తాచెదారంలో వర్షం నీటిలో నుంచే వెళుతూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న స్థానిక బండయప్ప మఠాధిపతి సోమయప్ప స్వామి వీధులలో తిరుగుతూ వర్షం నీరు వెళ్లకుండా ఎక్కడ ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకొని సర్పంచ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి వెంటనే ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా వీధులలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

జక్రాన్‌పల్లి బస్టాండ్‌లోనికి హైదరాబాద్ బస్సుల రాక

- కంట్రోలర్ నియామకం
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



బస్టాండ్‌లోకి వచ్చిన బస్సు

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో నవతెలంగాణ దినపత్రికలో ఆదివారం 'బస్టాండ్‌లోకి రాని బస్సులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లోకి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఆర్డీనరీ బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టారు. బస్టాండ్‌కు ప్రత్యేకంగా వచ్చిపోయే బస్సులను మానిటరింగ్ చేయడానికి ఒక కంట్రోలర్‌ను నియమించారు. ఇకనుంచి ప్రతినిత్యం హైదరాబాద్ బస్సులను, ఆర్డీనరీ బస్సులను జక్రాన్‌పల్లి బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ డిపో మేనేజర్ కవిత తెలిపారు. బస్సుల రాక కొరకు సర్వీస్ రోడ్‌లో వడ్ల కుప్పలు ఉన్నాయని వాటిని తొలగించి గ్రామస్తులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడి విరాళం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో నూతనంగా అంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా విగ్రహం ప్రతిష్టాపన చేయనున్న నేపథ్యంలో అంబేద్కర్ యువజన సంఘానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోలిపెల్లి మహేందర్‌రెడ్డి రూ.10వేలు విరాళంగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సంఘం సభ్యులు బక్కన్నగారి భాస్కర్, పర్మేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. దుబ్బకు చెందిన సింధుశ్రీ (21) అను యువతి 'న ఇంటి నుండి గతనెల 28న రాత్రి 10 గంటలకు ఇంట్లో వాళ్లు నిద్రిస్తున్న సమయంలో వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. తల్లి కురకటి స్వరూప ఆదివారం పిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. యువతి గురించి తెలిసిన వారు సమాచారాన్ని టౌన్-3 పోలీస్ స్టేషన్, నిజామాబాద్ ఎస్సై ఫోన్ నం.8712659839 లేదా 08462220350 కు తెలుపాలని పేర్కొన్నారు.

దళితశక్తి కార్యక్రమానికి తరలిన నాయకులు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ చేస్తున్న పదివేల కిలోమీటర్ల బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య పాదయాత్ర హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్న ముగింపు సభకు మండలంనుండి ఆదివారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి రవి, కార్యదర్శి గంగా సాయిలు, కోశాధికారి దిలీప్, మీడియా ఇంచార్జి రవి, కిరణ్, రాజ్, నర్సయ్య, బాబురావు, గణేష్, శేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫైనల్ రాత పరీక్ష ప్రశాంతం

- ఇంచార్జీ పోలీస్ కమిషనర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ ఫైనల్ రాత పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించినట్లు నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్, నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు వ్యాప్తంగా మొత్తం అభ్యర్థులు 5,285లి మంది రాతపరీక్షకు హజరు అవ్వాల్సి ఉండగా 12 పరీక్ష కేంద్రాలు నిజామాబాద్ టౌన్‌లో కేటాయించారని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సి. హెచ్. ప్రవీణ్ కుమార్ సమక్షంలో పర్యవేక్షించారు. 48మంది గైర్హాజరైనట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాలు రీజినల్ కో-ఆర్డినేటర్ (గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపల్) పి.రామ్‌మోహన్‌రెడ్డి, నిజామాబాద్ నోడల్ ఆఫీసర్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. మధుసుదన్ రావు సమక్షంలో నిర్వహించారు.

డిమాండ్లను నెరవేర్చాలి

- జూనియర్ జీపీ కార్యదర్శులు

నవతెలంగాణ-మోపాల్

తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం తమ డిమాండ్లను అమలుచేయాలని జూనియర్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండల గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు మండల కేంద్రంలో ఆదివారం చేపట్టిన సమ్మెలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులుగా నియమించినప్పుడు నాలుగు సంవత్సరాలు శిక్షణ కాలంగా పరిగణిస్తామని, ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోలేదన్నారు. శిక్షణ కాలాన్ని మరో సంవత్సరం పొడిగించారని, అది ముగిసినా ప్రభుత్వం నుంచి ఉలుకు పలుకు లేదని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు నూతన సచివాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ మొదటి సంతకం చేసి సీఎం ప్రకటించి తొమ్మిది వేల మంది పంచాయతీ కార్యదర్శుల జీవితాల్లో ప్రగతి వెలుగులు నింపాలని కోరారు. సమ్మెలో మండల జూనియర్ అసోసియేషన్ అసోసియేషన్ సభ్యులు ధీరజ్, నవీన్, మృదుల, హరీష్, నర్సింలు, చైతన్య మోహన్, వెంకట్, శ్యామ్, సునీత, పద్మజ, సంధ్య, సాయి, రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న జూనియర్ కార్యదర్శులు

మధ్యాహ్న భోజన బకాయిలను చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు డిమాండ్.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

నవతెలంగాణ-మోర్తాడ్

మధ్యాహ్న భోజన బకాయిలను చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గత విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు వంట చేసి పెట్టిన బిల్లులు ఇంతవరకు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడమే కాక కనీసం బిల్లులను కూడా చెల్లించకపోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు నిధులను తగ్గిస్తూ నిర్లక్ష్యం చేస్తుంటే మరొకవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందన్నారు. ఒకటి నుండి 8వ తరగతి వరకు రెండు నెలల బిల్లులను బాకాయి పెట్టడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెంచిన వేతనాలు 3000 రూపాయలను బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు సమావేశంలో ఏజెన్సీ నాయకులు నిరంజన, సాయవ్వ, భూమవ్వ, లక్ష్మి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మేడే జయప్రదం చేయండి

- బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మేడేను జయప్రదం చేయాలని బిఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ధిరాములు పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ కార్మికవర్గ మేడే వారోత్సవంగా దళిత కార్మికవర్గ నీల్‌లాల్ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మే 1 న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో, మే 2న మెదక్, జిల్లా, మే 3, సిద్ధిపేట జిల్లా, మే 4న సిరిసిల్ల జిల్లా, మే 5న నిర్మల్ జిల్లా, మే 6న జగిత్యాల జిల్లా, మే 7న హైదరాబాద్, రాష్ట్ర కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బిల్‌టీయూ, రాష్ట్ర నాయకులు శ్రీహరి, నిజామాద్‌జిల్లా నాయకులు జగదీష్, సైయ్యద్ పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతు పనులకు భూమిపూజ



చెరువుల మరమ్మతు పనులు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ ఎంపీపీ లావణ్య, సర్పంచ్ భూస సునీత, పార్టీ నాయకులతో కలిసి రెండు చెరువుల మరమ్మతులకు ఆదివారం భూమిపూజ చేశారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బాల్కొండ మండల కేంద్రంలోని సాయికుంట చెరువు మరమ్మతులకోసం రూ.10.25 లక్షలు, అలీం చెరువు మరమ్మతుల కోసం రూ.9.30 లక్షలు మంజూరు చేయించారని బాల్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావణ్య మాట్లాడుతూ సాయికుంటా చెరువు కట్ట బలోపేతం చేయడం, కట్టపై ఉన్న చెట్ల పొదలు తీయడం, అలీం చెరువు అలుగు, కాలువను వెడల్పు, లోతు చేయడం, కట్టపై ఉన్న చెట్ల పొదలు తీసివేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎంపీపీ భర్త లింగాగౌడ్, భూస నరహరి, కన్న పోశెట్టి, ఎంపీటీసీ సభ్యురాలు కన్న లింగవ్వ, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌటు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, సొసైటీ డైరెక్టర్ సల్ల పెద్ద నర్సయ్య వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్, సయ్యద్ మాజారోద్దీన్, నాయకులు ద్యావతి మురళీ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిప్పేర అశోక్, గ్రామ పెద్దలు ఈర్ల పోశెట్టి, ఆరేపల్లి రాజన్న, ఉపాధ్యక్షులు అర్కరి గంగాధర్, సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితబంధు పథకంలో అవినీతిని బహిర్గతం చెయ్యాలి

- అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణమే బర్తరఫ్ చేయాలి
- అవినీతిపై గవర్నర్ చర్యలు తీసుకోవాలి
- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎమ్మెస్ఎఫ్, ఎంఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళిత బంధు పథకంలో జరిగిన అవినీతిని బహిర్గతం చేయాలని అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణమే భర్తరఫ్ చేయాలని, ఈ అవినీతిపై రాష్ట్ర గవర్నర్కు ఫిర్యాదు చేయగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎమ్మెస్ఎఫ్, ఎంఎంఎస్, అనుబంధ సంఘాల నిజామాబాద్ జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పులాంగ్ చౌరస్తాలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొన్న 27న జరిగిన ప్లీనరీ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు దళిత బంధు పథకంలోని 10 లక్షల యూనిట్‌కు రెండు మూడు లక్షలు కమిషన్ తీసుకున్నట్లు తెలిపారని అన్నారు. ఇవి వివిధ దినపత్రికల్లో వార్తలు వచ్చాయని తెలిపారు. ఒక్క ఎమ్మెల్యే కూడా దీనిని ఖండించలేదంటే దళిత బంధు పథకంలో అవినీతి జరిగిందని ఒప్పుకున్నట్లని భావిస్తున్నామన్నారు. తక్షణమే దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడ్డ ఎమ్మెల్యేలను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకనాడు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా అవినీతి జరిగితే అస్సలు సహించనని ఒక టోల్ ఫ్రీ నెంబర్ కూడా తెలంగాణ ప్రజలకు ఇవ్వడం జరిగిందన్నారు. తన కొడుకు అయినా కేటీఆర్ కూడా అవినీతికి పాల్పడితే అసలు సహించనని అన్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ఇంతపెద్ద అవినీతి జరిగిందని, తన దగ్గర ఎమ్మెల్యేల చిట్టా కూడా ఉందని చెప్పి ఇప్పటికీ వాళ్లను భర్తరఫ్ చేయకపోవడం తెలంగాణ ప్రజలను మోసం చెయ్యడం అవుతుందని అన్నారు. అవినీతి చేసిన ఎమ్మెల్యేలకు మరోసారి ఛాన్స్ ఇవ్వడం అంటే అవినీతి పట్ల కేసిఆర్‌కు చిత్తశుద్ధి లేదని భావిస్తుందని తెలిపారు. గవర్నర్ తమిళసై స్పందించి ఆ అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకొని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల కోఆర్డినేటర్ గంధమాల నాగభూషణం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కనక ప్రమోద్ మాదిగ, ఎంఎంఎస్ నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకురాలు యమున మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోబేవర్ సంతోష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ టౌన్ నాయకులు రాములు మాదిగ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వైయస్సార్ మండల అధ్యక్షురాలిగా వందన

నవతెలంగాణ-ఆర్మూర్

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిప్పెర లావణ్య వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షురాలుగా గావాడే వందన ను నియమించారు. ఆదివారం వందనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం పిప్పెర లావణ్య మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పని చేయాలని, అప్పుడే రాజన్న రాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు. అప్పుడే మన బతుకుల్లో మార్పు వస్తుందని అన్నారు.

వీవోఏల వినూత్న నిరసన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు ఆదివారం మండలం కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద కళ్ళు, చెవులు, నోరు మూసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ తమకు కనీస గౌరవ వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల ఐకేపీ వీఓఏ ల సంఘం సభ్యులు పాల్గొన్నారు

వాగ్దేవి కళాశాలలో ఘనంగా వీడ్కోలు పార్టీ

- ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో చివరి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు మొదటి, ద్వితీయ సవంత్సరం విద్యార్థులు వీడుకోలు పార్టీ కార్యక్రమాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ కె సుజన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి భవిష్యత్తు కళాశాల నుంచి అందుకున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సమయాన్ని వృధా చేయకుండా అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చాలని గుర్తు చేశాడు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ఏ దత్తు, కె రవీంద్రరావు, సంధ్య, హరిష, జ్యోతి నిరంజన్, నరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



హాజరైన యాజమాన్యం, తదితరులు



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నాగాపూర్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం



చెరువుల మరమ్మతు పనులు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన డాకూరి రాజేశ్వర్ నూతనంగా ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్‌ను ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించి వారి మన్నలను పొందాలన్నారు. కార్యక్రమంలో సునీల్ సేన సభ్యులు పాలెపు నర్సయ్య, నల్ల గణేష్ గుప్తా, దూలూరి కిషన్ గౌడ్, గణేష్, గంగాధర్, అజయ్, సాయి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయం

- కేసీఆర్‌కు కృతజ్ఞతలు
- అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం దేశానికే ఆదర్శం
- దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నూతనంగా నిర్మాణం చేపట్టిన తెలంగాణ సెక్రటేరియట్‌కు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడం అభినందనీయమని నిజామాబాద్ జిల్లా దళిత సంఘాల నాయకులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా దళిత సంఘాల నాయకులైన ఎస్సీసీబీ డైరెక్టర్ గోర్కటి లింగన్న మాట్లాడుతూ...నూతన సెక్రటేరియట్ భవనానికి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుపెట్టడం స్వాగతిస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ దళితులకు అభివృద్ధి పథకాలు ఎన్నో చేస్తున్నారన్నారు. అంబేద్కర్ జయంతి రోజు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించడం స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పాకాల నరసింహులు. ప్రగతి కుమార్, ఎడ్ల సంజీవయ్య, లాల్‌సింగ్ వాగ్మారే, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

గుండారం బస్టాండ్ ప్రారంభం



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న వీడీసీ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని గుండారం గ్రామంలో ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దాసరి శేఖర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి కే చంద్రశేఖర్‌రావు సచివాలయాన్ని ప్రారంభిస్తే తాను బస్టాండ్ ప్రారంభించానని తెలిపారు. గ్రామంలో కొత్త ప్లాట్లలో హనుమాన్ ఆలయం, పురాతన కొనేరును పరిశీలించి ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సొసైటీ చైర్మెన్ దాసరి శ్రీధర్ జడ్‌పీటీసీ సుమలత గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్ రెడ్డి, ఎంపిటీసీ గంగాధర్, క్యాషియర్ రాజరెడ్డి, ఉమాపతి, మండల మైనారిటీ అద్యక్షులు జమీర్ ఖాన్, అబ్దుల్ పోతన్న, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వామ్మో.. పులి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మెండోర

మెండోర గ్రామ శివారులోగల పాత రేగడి (గంగేద్దు వాళ్ల) పొలం దగ్గర చిరుతపులి సంచరిస్తుందని, అటువైపు ఎవ్వరు వెళ్లకూడదని సర్పంచ్ మచ్చర్ల లక్ష్మి, రాజరెడ్డి గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు. అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సర్పంచ్ రాజారెడ్డితో కలిసి మొదట పులిని చూసిన మెండోర గ్రామానికి చెందిన ఈర్ల.ప్రవీణ్ అనే వ్యక్తిని విచారించారు. అనంతరం ప్రవీణ్‌కు పులి కనబడ్డ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో నీళ్ళు, గడ్డి ఉండటం వల్ల పులి పాదం అడుగులను ఖచ్చితంగా గుర్తించలేని పరిస్థితి ఉందని, నిజంగానే ఇక్కడ పులి సంచరిస్తుందని చెప్పలేమని, అంతా అబద్ధం అని చెప్పలేమని నిర్ధారించలేమని ఫారెస్ట్ సెక్షన్ అధికారి గణేష్ అన్నారు. కొన్ని రోజుల వరకు ప్రజలు ఆ ప్రాంతానికి వెళ్లకుండా ఉంటేనే మంచిదని ఒకవేళ అత్యవసరంగా వెళ్ళాలనుకుంటే గ్రూపులుగా వెళ్ళాలని సూచించారు. చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండటం మంచిదని సూచించారు. సర్పంచ్ లక్ష్మి రాజరెడ్డి, సర్పంచ్‌లకు పులి గురించి సంచారం సమాచారం అందజేశారు. వాట్సప్‌ల ద్వారా చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడంతో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు అభినందించారు.



మెండోరా శివారులో సంచరిస్తున్న పులి

ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఇదే పాఠశాలలో చదివిన 1979-80 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 43 సంవత్సరాల తర్వాత ఒకచోట ప్రత్యక్షంగా కలిసిన పూర్వ విద్యార్థులంతా ఆత్మీయతతో కూడిన పలకరింపులతో పులకించిపోయారు. ఆనాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుల తల్లి ఒడిలో ఆనాటి ఉరకలేసే కౌమారప్రాయంలోని మధురమైన స్మృతులను ఒకరికొకరు స్వాగతాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఒక పండుగలా చేసుకుని మిగిలిన శేష జీవిత కాలానికి సరిపడా ఉత్సాహాన్ని గుండెల్లో నింపుకున్నారు. అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఫోటోలు దిగి జ్ఞాపకాలను పదులపరుచుకున్నారు.



నూతన సచివాలయ నమూనా ప్రదర్శన



సచివాలయ నమూనా ప్రదర్శించిన నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

నూతన సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సచివాలయ నమూనాను తయారు చేసి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ సచివాలయాన్ని చరిత్ర పుటల్లో మిగిలిపోయేలా 28 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారని తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్వయానా ఇంజనీర్ అయినందున సీఎం కేసీఆర్ సచివాలయ నిర్మాణ బాధ్యతలు ఆయనకు అప్పజెప్పిన వెంటనే నిర్మాణ పనిని తన భుజస్కంధాలపై వేసుకొని సచివాలయాన్ని అద్భుత దృశ్యంగా మలిచారని అన్నారు. సచివాలయానికి అంబేద్కర్ పేరును నామకరణం చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. తొర్తి గ్రామానికి చెందిన తోపారం రాజ్ కుమార్ సచివాలయ నమూనా తయారీలో కీలక భూమిక పోషించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాహెర్, ఈశ్వర్, అంజాత్, అజ్మత్, ఈర్గాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక



మున్నూరుకాపు సంఘం మండల నూతన కమిటీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) గ్రామంలో మున్నూరు కాపు మండల కమిటీని ఎనునకున్నారు. సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుత్ప రఘుపటేల్, ప్రధాన కార్యదర్శిగా తడుక సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బొడ్డు గణేష్, గోపి, మహేష్, కోశాధికారిగా బొడ్డు రఘు, పెద్దలు చిట్టి సాయిరెడ్డి, సాయన్న, జక్కు గణపతి, బున్నేరవీందర్, రామ్మూర్తి, నర్సారెడ్డి, గుత్ప ప్రసాద్, కుల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రఘుపటేల్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికోసం జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ సహాయ సహకారాలు తీసుకొని మండల సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని అన్నారు. పేద కాపులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కలిసికట్టుగా పనిచేస్తామని, సంఘం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటునందిస్తానని తెలిపారు.

బీసీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశ పరీక్ష ప్రశాంతం గా ముగిసిందని రీజనల్ కోఆర్డినేటర్ కె.సత్యనాథ్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు నిజామాబాద్‌లో, ఏడు కామారెడ్డిలో నిర్వహించినట్లు తెలిపారు. 22 పరీక్ష కేంద్రాల్లో నాలుగు డిగ్రీ పరీక్షా కేంద్రాలు, 18 ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో నిర్వహించామని చెప్పారు. అందులో ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష విద్యార్థులు 4543 కు 4092 మంది విద్యార్థులు హాజరయ్యారని, డిగ్రీ ప్రవేశ పరీక్షకు 620 మంది విద్యార్థులకు 534 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు

యుద్ధ ప్రాతిపదికన గౌడ సంఘం పనులు

నవతెలంగాణ-నందిపేట్

మండలకేంద్రంలో గౌడసంఘం పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అధ్వర్యంలో నిర్మిస్తున్న మండల గౌడ సంఘం ఫంక్షన్ హాల్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ మేనమామ లాగా లక్ష ఒక వెయ్యి 116 రూపాయలు ఇచ్చి సాయం చేస్తుంటే, ప్రతి పేద గౌడపిల్లలు ఉచితంగా ఫంక్షన్ హాల్‌లో వివాహాలు చేసుకోవాలనే కలతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్ని కులా సంఘాలకు పంక్షన్ హాల్ మంజూరు చేశారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్ గౌడ్, నాందేడ్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీ బజరంగ్, సత్యగౌడ్, సుభాష్ గౌడ్, భోజాగౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వంద ఎపిసోడ్స్ 100 పుస్తకాలతో సమానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మన్ కీ బాత్ వంద ఎపిసోడ్స్ 100 పుస్తకాలతో సమానమని, ఈ 100 ఎపిసోడ్స్‌లో ప్రధానమంత్రి చెప్పిన విషయాలను పుస్తక రూపంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ అన్నారు. ఆదివారం నాగారంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. మనకి తెలియని మహాపురుషుల చరిత్రను పరిచయం చేశారని . ఏ ఒక్క ఎపిసోడ్‌లోనూ రాజకీయాలు మాట్లాడలేదని, వినని వారు ఎవరైనా ఉంటే నాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కోసం కార్మికుల హక్కుల కాలరాత



చికాగో త్యాగాలతో కార్మిక ఉద్యమం కనీస విలువలను చట్టబద్ధం చేసుకోగలిగింది. ఇట్లాంటి అనేక త్యాగాలతో ప్రపంచ కార్మిక ఉద్యమం తన కాళ్లపై తన నిలబడగలిగి మానవాళి విముక్తి కోసం తన శక్తిని ధారపోస్తు వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడ్డ సంక్షోభంతో కార్మిక శక్తి ఒత్తిడి మేరకు ప్రపంచ రాజ్యాలు సంక్షేమాన్ని తమ ప్రాధాన్యతగా ఎంచుకోవాల్సి వచ్చింది. ఫలితంగానే సంక్షేమ రాజ్య భావన బలపడి బలహీనుడికి బతకగలిగే అవకాశం కొద్ది మేరకైనా దక్కగలిగింది. యుఎస్ఎస్ఆర్ పతనం తర్వాత కార్మిక ఉద్యమాన్ని విధ్వంసం చేయగలిగే వాతావరణాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్ శక్తులు రూపొందించుకున్నాయి అంతకుముందే ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు ఇందుకు దోహదం చేశాయి కూడా.

1977 నుంచి ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ గారడి పాలనలో పెట్టుబడిదారీ విధానం మరింత బలోపేతమై అంతిమంగా పెట్టుబడిని కూడా మింగే కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ దేశంలో పాదుకొల్పబడింది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా దేశంలో ఆటవిక నిర్వహణ రాకుండా ఉండేందుకు ఆర్థిక వ్యవస్థను ప్రజాసంక్షేమాన్ని సమన్వయం చేసుకునే అద్భుతమైన కార్మిక చట్టాల రూపకల్పన 1926 నుంచే(ట్రేడ్ యూనియన్‌లో ఏర్పాటు చట్టం) ప్రారంభమైంది. ఇది క్రమక్రమంగా కార్మిక సంక్షేమం విస్తృతి చెందింది.1200 సెక్షన్లతో 44 కార్మిక చట్టాలతో పెట్టుబడిని ప్రభుత్వాన్ని నియంత్రిస్తూ వచ్చింది. కానీ ఈ చట్టాలు ఆశ్రిత పెట్టుబడి లేదా కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా ఉండడంతో కార్పొరేట్ శక్తులు మతసహచర్యాన్ని ఆశ్రయించాయి. తమకు అనుకూలమైన వ్యక్తిని ప్రధానిగా ప్రతిష్టింప చేసుకున్నాయి.

ఈ చట్టాలే కార్మికులను సంరక్షించుకున్నాయి వీటి రూపకల్పనలో మహనీయుడు అంబేద్కర్ విశేషమైన కృషి చేశారు. నేటి ప్రధాని మోడీ అదే అంబేద్కర్ కార్మిక ఆలోచనలను వక్రీకరించి తన వారికి దోచిపెట్టడానికి 44 కార్మిక చట్టాలను 29 చట్టాలకు కుదించి 12 చట్టాలను పూర్తిగా రద్దుచేసి నాలుగు కోడ్ లుగా విభజించారు. అంబేద్కర్ కలల సాధన కోసం, నూతన భారతదేశం కోసమని "రెడ్ టేపిజాన్ని" ఆపుతానని అనడమే కాక శ్రమ యోగి రాష్ట్ర యోగి అనే నూతన పేర్లతో కార్మికులకు పేరు పెట్టి నయవంచనకు గురి చేశాడు. ఇప్పటికే తన విధానాలతో 8 కోట్ల సంఘటిత కార్మిక శక్తిని 5 కోట్లకు కుదించేసినాడు. దీనితో దేశంలో 50 కోట్లకు అసంఘటిత కార్మికులు పెరిగిపోయినారు. భద్రత లేని కనీస బతుకుదెరువు లేని అసంఘటిత కార్మికులకు ఆరోగ్య భీమా లాంటి ఎరలు వేసి మొత్తం ఆర్థిక వ్యవస్థ ఫలాలను తన ఇద్దరు మిత్రులైన ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నాడు. ఈ క్రమంలో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో దేశానికి తీవ్రమైన నష్టాన్ని ఈ పాలకులు కల్పించారు. పనిగంటలను పెంచడంతో కార్మికులకు మరింత ఒత్తిడి పెరిగి పెద్ద ఎత్తున మరణాలు సంభవిస్తున్నాయని కొన్ని దేశాల అనుభవాలు సాటి చెబుతున్నాయి. 2016 ఒక్క సంవత్సరంలోనే 7,60,000 మంది పని గంటల పెంపుదల కారణంతో అసహజంగా మరణించారని 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ' రిపోర్టులు చెబుతున్నాయి. అంతే మేరకు ఈ పని గంటలు ఉపయోగించుకున్న పారిశ్రామిక సంస్థలు కార్పొరేట్ సంస్థలు గా మారిపోయినాయి.

సమ్మె హక్కును ను జీవించే హక్కులో భాగంగా పొందిన కార్మికులు ఈ కొత్త చట్టాలతో కోల్పోతున్నారు.15 రోజుల ముందు ఇచ్చే సమ్మె నోటీసు కాస్త 60 రోజుల ముందుగా మారింది.ఏడుగురితో కూడా యూనియన్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని మార్చివేసి దేశ కార్మిక సంఘాల త్యాగాల చరిత్రను 1926 నాటికి తీసుకుపోయారు. యూనియన్ లో 1/3 బయటివారు ఉండడం వల్ల కార్మికులు యజమానులకు భయపడకుండా అన్యాయం జరిగినప్పుడు నిలదీసే అవకాశం ఉండేది. అది నేడు లేబర్ కోడ్‌ల రూపంలో తొలగించారు., యూనియన్‌కు కంపెనీ ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించుకునే అవకాశం గతంలో ఉండేది. ఆ కంపెనీ అక్రమ లాభాలు ఎక్కడ బయటపడతాయోనని ఈ పర్యవేక్షణ అవకాశాన్ని తొలగించారు. సమస్యను లేవదీసే హక్కును కూడా కోల్పోయారు. ఈ కొత్త చట్టాలతో మహిళా కార్మికులకు 12 నుంచి 26 వారాల ప్రసూతి సెలవు లాంటి ఒక చిన్న ఎరను వేసి రాత్రి వేళలో కూడా 12 గంటల నుంచి 16 గంటలుగా శ్రమ దోపిడిని పెంచుకుంటున్నారు. పని పరిస్థితులు, రుతుస్రావాలు మొదలగునవి కూడా కంపెనీ ఆలోచన చేతుల్లోకి వెళ్లిపోయాయి. లంచ్ రూమ్ క్యాంటీన్,రెస్ట్ రూమ్, డ్రింకింగ్ వాటర్, ఫీడింగ్ రూములు, ఇలాంటి కనీస సౌకర్యాలను ఈ చట్టాలు తీవ్రమైన ప్రభావితం చేయబోతున్నాయి. యజమాన్యాలు కనీసం కార్మికులను మనుషులుగా గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

కార్మికుల తొలగింపుకు గతంలోని మార్గదర్శకాలు మారిపోయాయి. అతి చిన్న కారణమైనా,అసలు కారణాలే లేకుండా కూడా కార్మికులను తొలగించే అవకాశాలు నిరంతరంగా యాజమాన్యాలకు కల్పించాయి. తొలగించబడ్డ కార్మికులు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశాన్ని కూడా ఈ కొత్త చట్టాలు అడ్డుకుంటున్నాయి. యజమాని ఆధ్వర్యంలో రూపొందించబడ్డ మధ్య దళారీ వ్యవస్థ చేతుల్లోకి కార్మికుల తొలగింపు నిర్ణయం వెళ్ళబోతుంది. ఇలాంటి అత్యంత దారుణమైన, మానవ పరిణామ క్రమాన్ని వెనక్కి తిప్పిన మోడీ చట్టాలు రాజస్థాన్ లో ప్రయోగాత్మకంగా అమలై అభ్యుదయ పాలనలో ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా ఇటీవల కాలంలో అమలుకు సిద్ధపడ్డది. తెలంగాణ ఇంకా వేగంగా యజమానులకు సహకారం అందించే పద్ధతిలో కార్మికులకు వ్యతిరేకంగా అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనం దృష్ట్యా కార్మిక చట్టాలను నిలిపివేయాలి. పౌర సమాజం కార్మికులు సంఘటితోద్యమం చేయడం ద్వారా సమ్మె హక్కును కోల్పోతే బానిసగా మారుతామనే అంబేద్కర్ అభిప్రాయంతో చికాగో పోరాటస్ఫూర్తిని ఎత్తు పట్టి ప్రతిగాథ శక్తులను అడ్డుకుందాం.

-పందుల సైదులు. 9441661192

గడీల రాజ్యం పోతేనే సంపూర్ణ న్యాయం

- ప్రతిఊర్లో ఓటుచైతన్యం తీసుకురావాలి
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-బోధన్



అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజలను దోచుకుంటు ఆస్తులు కూడబెట్టుకుంటున్న కేసీఆర్ గడీల రాజ్యం కూల్చితేనే తెలంగాణ ప్రజలు బాగుపడతారని బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్యాక్టరీల పేరుతో నిరుపేదల భూములు లాక్కుంటున్నారని అన్నారు. అనంతరం దళిత సేన జాతీయ అధ్యక్షులు జేసీ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఊళ్లో విద్య యొక్క ప్రాధాన్యత గుర్తించి ముందుకు సాగితే మనకు మనుగడ ఉందన్నారు.అనంతరం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ఓటు హక్కుతోనే బహుజన రాజ్యాధికారం సాధించవచ్చని, కావున ప్రతి గ్రామంలో ఓటుపై చర్చ చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సభకు వర్షం వల్ల ఆటంకం కలిగిన జనం నాయకుల ప్రసంగాలు ఓపికగా వినడం గమనార్హం. కార్యక్రమంలో నాయకులు మహనీయుల చిత్ర పటాలకు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సి, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఈశ్వర్, వెంకటి, పాండు, సంజీవ్, దేవేదర్, శ్రావణ్, అలోక్, సుభాష్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీమాత జన్మదినోత్సవ కార్యక్రమం నిర్వహించినట్టు సంఘ సభ్యులు మెడికల్ విక్రమ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పల్లికొండ గోపినాథ్ లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వాసవీమాతకు కుంకుమార్చన, పంచామృత అభిషేకంసూంజల్ సేవ, నామకరణ కార్యక్రమాలను భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. పలు రకాల పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో పూజలు

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వబ్రాహ్మణుల కులదైవమైన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మామిడిపల్లి, పిప్రీ, వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామాల్లో బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎస్ విశాల్, ప్రణీత్, శివకుమార్, పిప్రి సుంకం భూషణ్, కత్రాజీ రమణాచారి, పడగల్ రాగి ప్రభాకర్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మోపాల్ : మోపాల్ మండలంలోని బోర్గం(పి) ప్రాంతంలో వీరబ్రహ్మేంద్రస్వామివారి దేవాలయంలో ఆదివారం 330వ ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైదిక పురోహితులు బ్రహ్మశ్రీ కత్రోజు నర్సయ్య చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి వివరించిన గొప్ప తాత్వికవేత, యుగ పురుషులు సామాజికవేత్త వీరబ్రహ్మేంద్ర అని అన్నారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కమ్మరి రాజేశ్వర్ ఉపాధ్యక్షులు ముచ్కూర్ గంగ నర్సయ్య, కోశాధికారి జిజి చారి పాల్గొన్నారు.

ముప్కాల్ : విశ్వ బ్రాహ్మణ సంఘం బాల్కొండ ఆధ్వర్యంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 330 వార్షిక ఆరాధన గురుపూజోత్సవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ విశ్వబ్రహ్మ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

బొజ్జ బిక్షమయ్య
సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు

137వ కార్మిక పోరాట దినం"మేడే"ను ప్రపంచ వ్యాప్తంగా దీక్షా దినంగా జరుపుకుంటున్న శ్రమజీవులందకి విప్లవ జేజేలు. మార్క్స్ పిలుపైన "ప్రపంచ కార్మికులారా ఏకంకండి!" అనే నినాదాన్ని వాస్తవ రూపం తేవడానికి శ్రమజీవులందరూ ప్రతిజ్ఞ పూనాలి. భారతదేశంలో మనువాద శక్తులు మేడే స్ఫూర్తికి భిన్నంగా కార్మిక వర్గాన్ని, ప్రజలను కులాల పేరుతో, మతాల పేరుతో విభజిస్తూ ఆదిమ కాలానికి తీసుకెల్తున్నారు.భారత కార్మిక వర్గం మరింత జాగురుతతో మనువాదుల కుట్రలు తిప్పికొడుతూ కార్మిక, కర్షక గరిష్ఠ ఐక్యతను సాధించాలి. కార్మిక వర్గ హక్కులను ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటూ మనువాద పాలక వర్గాల నుండి ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగాన్నీ కాపాడుకోవడానికి ప్రతిన పూనుదాం!.

1886 మేడే పోరాటం కంటే పూర్వ పరిస్థితి

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దానికి ఒక ప్రత్యేకతుంది. పారిశ్రామిక విప్లవం ఇంగ్లాండులో ప్రారంభమై ఐరోపాకు, అమెరికాకు విస్తరించింది.పరిశ్రమాధిపతుల దోపిడి పీడనలకు ఆకాశమే హద్దుగా నిలిచింది. కార్మికులను బానిసలుగా పనిచేయించుకునేవారు. 6,7 సంవత్సరాల పిల్లలు, మహిళలచే ఫ్యాక్టరీలలో, గనులలో, చీకటి సొరంగాలలో పనిచేయించే వారు. చిన్న పిల్లల భుజాలకు తాళ్లు కట్టి పొగ గొట్టాలలో దింపి శుభ్రం చేయించేవారు. దిక్కుమొక్కు లేని పిల్లలు ఎంతో మంది చనిపోయారు. రాత్రి పగలు నిద్రాహారాలు లేకుండా యంత్రాల వద్ద నిలబెట్టి 16నుండి20గంటలు పనిచేయించే వారు. కునుకు తీసిన, పనిచేయక పోయిన కొరడాలతో కొట్టేవారు. అధిక పని గంటలకు తోడు అధిక పనిభారం, కనీస వేతనాలు కూడా ఇచ్చేవారు కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులపై కార్మికులు ఎక్కడికక్కడ తిరుగుబాట్లు చేసేవారు.

యూరోపు ఖండంలోను, అమెరికాలోను పనిగంటల తగ్గింపు కోసం పెద్దయెత్తున పోరాటాలు చేశారు. విధిలేని పరిస్థతులలో అమెరికన్ ప్రభుత్వం రోజుకు పదిగంటల పనికి 1837లో శాసనం చేసింది. యూరపు ఖండంలో కార్మికులు చేసిన పోరాటాల వల్ల రోజుకు 10గంటల పనిదినంగా చట్టాలు చేశారు. 1881సం॥లో చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి "అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" ఏర్పాటు చేసుకున్నారు. అందులో రోజుకి 8గంటల పనిదినం కోసం దేశవ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించారు. జనీవాలో మొదటి అంతర్జాతీయ మహాసభ 1866 సెప్టెంబర్ లో జరిగింది. ఆ సభ రోజుకి 8గంటల పనిదినం చట్టబద్ధం చేయాలని నిర్ణయించింది. ప్యారిస్ కాంగ్రెస్ సైతం తక్షణ డిమాండ్‌ల కోసం పిలుపునిచ్చింది. 1.చట్టం ద్వారా 8గంటల పని నిర్ణయించాలి. 2.బాలల శ్రమను నిషేదించాలి. 3.యువ మహిళల శ్రమపై పరిమితి ఉండాలి. 4.రాత్రి పనికి, ప్రమాదకర పనులకు ప్రత్యేక నిబంధన ఉండాలి. 5. చట్టబద్ధమైన వారంతపు విశ్రాంతి. 6. స్త్రీపురుషులకు సమానపనికి సమాన వేతనం. 7.ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు హక్కు,స్వేచ్ఛ.1867లో ప్రచురితమైన క్యాపిటల్ ప్రథమ సంపుటంలో పనిదినం అనే అధ్యాయంలో 8గంటల పనిగురించి మార్క్స్ పేర్కొన్నాడు.

1886 మే1 చారిత్రాత్మక సమ్మె - ఎర్రజెండా పుట్టుక

అమెరికా దేశంలోని చికాగో నగర కార్మిక వర్గం ధృఢమైన విప్లవ ధృక్పధం కలవారు. కార్మికులను విప్లవ మార్గాన నడిపిస్తూండేవారు. 1886 మే 1న సమ్మెకు ముందే కొంత మంది కార్మిక నాయకులు కలిసి "8గంటల పనిదినం సంఘం" ఏర్పాటు చేశారు. ఈ సంఘం నాయకత్వంలో మే1కి ముందునాటి ఆదివారం రోజు 25వేల మంది కార్మికులతో చికాగో నగరంలో పెద్ద ప్రదర్శన జరిగింది. మే1న చికాగో నగరంలోని కర్మాగారాల నుండి లక్షలాదిమంది కార్మికులు సమ్మెలో దిగారు. చికాగో నగర వీధులన్నీ కార్మిక ప్రదర్శనలతో నిండిపోయాయి. సమ్మె కొనసాగుతూ ఉండగా మే3వ తేదిన అమెరికన్ పోలీసులు జరిపిన కాల్పుల్లో 6గురు కార్మికులు మరణించారు. ఈ దారుణ హత్యాకాండను నిరసిస్తూ మే4వ తేదిన చికాగో నగరం నడిబొడ్డున ఉన్న "హే మార్కెట్" లో కార్మికులు నిరసన సభ జరిపారు. శాతియుతంగా జరుగుతున్న సంతాప సభ మీద పోలిసులు పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. ఎవరో బాంబు పేల్చారు. ఒక పోలీసు అధికారి మరణించారు. పోలీసులకు, కార్మికుల మధ్య జరిగిన హెూరాహెూరి పోరులో 7గురు పోలీసులు,4కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. హే మార్కెట్ మొత్తం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. తమ పోరాట పటిమను తెలియజేస్తూ ఆ రోజు ఎగురవేసిన విజయ కేతనమే నేటి మన "ఎర్రజెండా" అదే మన "అరుణకేతనం".

హే మార్కెట్ ఘటనపై కేసులు పెట్టి విచారణ జరిపారు. సమ్మెకు నాయకత్వం వహించిన 4గురు నాయకులు పార్సన్, స్పైస్, ఫిషర్, ఎంగెల్స్ లకు ఉరిశిక్ష విధించారు. మరికొంత మందికి దీర్ఘకాల కారాగార శిక్షలు విధించారు. ఉరి తీసే ముందు కార్మిక నాయకుడు స్పైస్ పాలకవర్గాలను "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయనుకుంటున్నారా? అదిగో అక్కడ, ఇక్కడ, ఆమూల, ఈమూల,మీ వెనుక, మీ ముందు అన్ని చోట్ల జ్వాలలు రేగుతాయి. దానిని ఆర్పడం మీ తరంకాదు". గర్జించారు.

చికాగో కార్మిక విరోచిత త్యాగాల పోరాట చరిత్ర వృదా కాలేదు. ప్రపంచ దేశాలన్నిటిలో కార్మిక వర్గం మేడే పోరాట స్ఫూర్తి పొందాయి. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్ట్ ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మే1ని అంతర్జాతీయ కార్మిక దినంగా జరపాలని తీర్మానించింది. అప్పటి నుండి ప్రపంచ దేశాలలో మే1ని కార్మిక దీక్షాదినంగా, కార్మిక పోరాటలకు, త్యాగాలకు గుర్తుగా మేడే నిర్వహిస్తున్నారు.

ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్

ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గాన్ని ఏకంచేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. 1864సెప్టెంబర్ 28వ తేదిన లండన్‌లోని సెయింట్ మార్టిన్ హాలులో వివిధ దేశాల కార్మిక ప్రతినిధులతో మొట్టమొదటి సమావేశం జరిగింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ తదితర దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి కారల్ మార్క్స్ కూడా హజరయ్యారు. జర్మనీ తరుపున సెంట్రల్ కమిటీకి ఎన్నుకోబడినాడు. ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ఏర్పడింది. కారల్ మార్క్స్ సమర్పించిన నిబంధానవళి, ప్రకటనలు చిన్న చిన్న సవరణలతో ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. 1848లో ప్రకటించబడిన "కమ్యూనిస్ట్ ప్రణాళిక" లోని ప్రపంచ కార్మికులారా! ఏకంకండి!! అనే పిలుపును చారిత్రక నినాదంగా సభలో మారుమ్రోగింది.

భారత దేశంలో మే డే

భారత దేశంలో పారిశ్రామిక సమ్మె మొట్టమొదటి సారిగా రైల్వేలలో జరిగినట్టుగా తెలుస్తుంది. 1862 ఏప్రిల్, మే నెలలో కలకత్తాలోని హౌరా రైల్వే స్టేషన్‌కు చెందిన 1200 మంది కార్మికులు 8గంటల పనిదినం కావాలని సమ్మె చేశారు. చికాగో కార్మికులు 1886లో నిర్వహించిన మేడే పోరాటానికి 24సంవత్సరాల ముందే భారత హౌరా రైల్వే కార్మికులు 8గంటల పనిదినం కోసం సమ్మెచేయడం ఒక చారిత్రక సంఘటన. భారతదేశంలో 1923 మే1న మద్రాసులో మళయపురం సింగార్ వేలర్ నాయకత్వంలో ప్రపధమంగా ఎర్రజెండా ఎగురవేసి మే డే నిర్వహించారు. ఏఐటీయూసీ పుట్టిన 3 ఏండ్లకే మేడే జరిగింది.

మే డే - 8గంటల పనిదినం ప్రాతిపదిక ఏమిటి?

చికాగో కార్మికుల విరోచిత పోరాటం, ప్రాణ త్యాగాల ఫలితంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా 8గంటల పనిదినం అమలు అవుతుంది. 8గంటల పని మాత్రమే ఉండాలనే డిమాండ్ వెనుక ఉన్న ప్రాతిపదిక ఏమనగా ఏ దేశంలో అయిన, ఏ కాలంలో అయిన, ఎవరికైన ఒక రోజుకు 24గంటలే ఉంటాయి. ఈ 24గంటలను 3 సమభాగాలుగా విభజించి 8గంటలు విశ్రాంతి లేదా నిద్ర మరో 8గంటలు కటుంబ భాధ్యతలుగా ఉంటాయి. కార్మికునికి విశ్రాంతి లేకుంటే శక్తి పునరుత్పత్తి కాదు కాబట్టి పనిచేయలేడు. అలాగే తన కుటంబ జీవితం, సామాజిక సంబంధాలు, వినోదం,విజ్ఞానం కూడా కార్మికునికి అత్యంత అవసరం. కాబట్టి పని+విశ్రాంతి+కుటుంబ జీవితం దృష్టిలో ఉంచుకుని 8గంటల పని నిర్ణయించబడింది.

మే డే - అంబేద్కర్

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో మేడే పోరాటాల ఫలితంగా 8గంటల పని చట్టబద్ధం చేయబడింది. భారత దేశాన్ని ఆనాడు బ్రిటిష్ పాలక వర్గాలే పాలించినప్పటికి అక్కడి చట్టాలను ఇక్కడ అమలుచేయలేదు. రోజుకు 12నుండి14గంటల పని కొనసాగింది. బ్రిటిష్ ప్రభుత్వంలో డా॥బాబా సాహెబ్ అంబేద్కర్ "వైశ్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్" లో జులై 7,1942నుండి 1946 వరకు లేబర్ మెంబర్‌గా ఉన్నారు. డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ భారత కార్మిక, ఉద్యోగ, మహిళల కోసం అనేక చట్టాలు చేసి అమలు చేయించారు. ఈనాడు భారత కార్మికులు అనుభవిస్తున్న అనేక చట్టాలు అంబేద్కర్ కృషి ఫలితమే.

27నవంబర్1942లో ఢిల్లిలో జరిగిన 7వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో భారత దేశంలో అమలు అవుతున్న14 గంటల పనిని 8గంటలకు కుదించారు. స్త్రీ,పురుషులకు సమాన పనికి సమాన వేతనం, వేతనాల చెల్లింపు చట్టం, కనీస వేతనాల చట్టం, వేతన సవరణ చట్టం, ఫ్యాక్టరీల చట్టం, ట్రేడ్ యూనియన్ చట్టం, నష్ట పరిహార చట్టం, రక్షణ చట్టం, ప్రసూతి చట్టం, ఈఎస్ఐ, సిఎం పిఎఫ్, బోనస్, మహిళలు బాలకార్మికుల చట్టం, గనులలో మహిళల నిషేద చట్టం, సామాజిక భద్రత, ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చెంజ్ తదితర అనేక చట్టాల రూప కల్పనలకు అంబేద్కర్ కీలక భూమిక పోషించారు.

కార్మికుల గురించి అంబేద్కర్ ఇలా చెప్పారు.

"పోరాడే హక్కులేని కార్మికులు భానిసలౌతారు. కార్మికులను భానిసలు చేసే ఏ చట్టాలను నేను అంగీకరించను", "దేశానికి అవసరమైన నాయకత్వాన్ని కార్మిక వర్గం మాత్రమే సమకూరుస్తుంది". "కార్మికులు, కర్షకుల పాలనలోనే దేశంలో సామ్యవాదం స్థాపించగలరు". "దేశానికి, కార్మికవర్గానికి కాపిటలిజం, బ్రాహ్మనిజం ప్రధాన శత్రువులు". "భారతీయ కార్మిక వర్గం రాజ్యాధికారాన్ని సాధించుకోవాలి".

మే డే - మనువాద విధానాలు

ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ తదితర మనువాద సంస్థలు మేడే స్ఫూర్తిని, వారసత్వాన్ని అంగీకరించరు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో కార్మిక ఉద్యోగ వర్గాలలో "భారతీయ మజ్దూర్ సంఘ్(బిఎంఎస్)" పనిచేస్తుంది. ఈ సంస్థ మేడేను అంగీకరించదు.యాజమానులకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడటం తప్పని చెపుతుంది. కార్మికులు, యాజమాన్యం మధ్య సంబంధం తండ్రి,కొడుకుల సంబంధమని ప్రభోదిస్తారు. కొడుకుల లాంటి కార్మికులు తండ్రులలాంటి యాజమాన్యాలు చెప్పినట్టు వినాలి, బ్రతిమాలాడుకోవాలి తప్ప ఎదురుతిరగకూడదంటారు. మే డే కు పోటిగా "విశ్వకర్మ జయంతి"ని నిర్వహిస్తారు. విశ్వకర్మ అంటే దేవుడు, సృష్టి అని చెప్పడమే. ఈ సంస్థల రాజకీయ విభాగమే "భారతీయ జనతా పార్టీ(బిజెపి)".

2014నుండి కేంద్రంలో నరేంద్ర మోడి నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం కొనసాగుతున్నది. ఈ పార్టీ తమ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి లోబడి మేడే స్ఫూర్తికి అడుగడుగునా తూట్లు పొడుస్తుంది. కార్మిక, ఉద్యోగ,ప్రజా వ్యతిరేవ విధానాలను అవలంభిస్తున్నది. బ్రిటిష్ ప్రభుత్వం నుండి నేటివరకు కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, వసతులు, సౌకర్యాలను కాలరాస్తుంది. అనేక చట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్‌లుగా మార్చింది. తాను ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమలను స్థాపించకపోగా గత ప్రభుత్వాలు స్థాపించిన భారీ, కీలక పరిశ్రమలు, సంస్థలను పనిగట్టుకొని ప్రయివేటు పరం చేస్తున్నది. దేశ సంపదను బహుళ జాతి కంపెనీలకు అదానీ లాంటికార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని అబద్దాలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కోట్ల ఉద్యోగాలను తీసేస్తున్నది. బహుజన వర్గాలకు చెందాల్సిన రాజ్యాంగ హక్కులను, రిజర్వేషన్లను అమలు చేయడం లేదు. అందోళనలను, పోరాటాలను ఉక్కుపాదంతో తొక్కి పారేస్తున్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జాతీయ సెలవు దినంగా ప్రకటించడం లేదు. అనేక సంస్థలలో 8గంటల పనిని 12గంటలకు పెంచారు. మహిళలను రాత్రి డ్యూటీలు, మైనింగ్ పనులలో సైతం పనిచేయిస్తున్నారు. సంఘం పెట్టుకునేందుకు అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారు. ప్రతి పరిశ్రమలో, గనులలో, సంస్థలలో గుళ్లు కట్టి హక్కుల కోసం దేవునికి మొక్కమంటున్నారు. కార్మిక, ఉద్యోగుల మధ్య కులం,మతం పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారు. మనువాద అచారాలు,సాంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో దేశాన్ని సనాతన ధర్మం పేరుతో తిరోగమనానికి తీసుకువెల్తున్నారు.

మే డే కార్మిక వర్గ కర్తవ్యం

దేశంలో మనువాద ఫాసిస్ట్ శక్తులు అధికారంలో వున్నాయి. దీనిని ఏ ఒక్కరు ఒంటరిగా నిలువరించలేరు. కార్మిక వర్గమే విశాల ఐక్యసంఘటన ఏర్పాటుచేయాలి. రైతులు, యువజనులు, మహిళలు, విద్యార్థులు, కవులు,కళాకారులు, మేధావులు సమస్త ప్రజలను కదిలించాలి. దేశాన్ని కాపాడుకుందాం,ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే అందోళనలు దేశ వ్యాప్తంగా విశాల ఐక్య సంఘటనల ద్వారా జరగాలి. కార్మిక వర్గం తమ ఆర్థిక డిమాండ్లకు పరిమితం కాకుండా రాజకీయ డిమాండ్లపై కూడా అందోళనలు చేయాలి. సామాజిక శక్తుల దైనందీన డిమాండ్లకే పనిచేయాలి. యూనియన్లు తమ కార్యకలాపాలను పని స్థలాలకు మాత్రమే పరిమితం కాకుండా నివాస స్థలాల్లో కూడా కార్యక్రమాలు చేయాలి.విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవ ఆచరణ లేకుండా విప్లవ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఉండదని మహెూపాధ్యాయులు చెప్పినదానిని నిరంతరం గుర్తుంచుకోవాలి.

శ్రమజీవులందరికీ మే డే శుభాకాంక్షలు - జేజేలు

మే డే వర్ధిల్లాలి !

మేడే స్ఫూర్తిని ఎలుగెత్తి చాటదాం!!

మహిళా వ్యాపారులకు మూడు లక్షల వరకు రుణాలు

సెర్ఫ్ మండల ఏపీఎం
కుంట గంగారెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈ ఆర్థిక సంవత్సరంలో నూతనంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే మహిళా సంఘ సభ్యులకు రూ. 3 లక్షల వరకు వ్యక్తిగత అదనపు రుణం మంజూరు చేయడం జరుగుతుందని సెర్ఫ్ మండల ఏపిఎం కుంట గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క గ్రామ మహిళా సమాఖ్యకు ఐదుగురు మహిళల చొప్పున మండలంలో 150మంది మహిళలకు ఈ రుణాలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ఎలాంటి వ్యాపారానికైనా ఈ రుణాలు మహిళా సంఘాల ద్వారా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. వీటితోపాటు ఇదివరకే వ్యాపారాలు చేస్తున్న వారికి కూడా వ్యాపార విస్తరణకు అదనపు రుణాలు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ రుణాలను అతి తక్కువ వడ్డీకి అందించడం జరుగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరం ఉన్నవారు సమీప ఐకెపి సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

శ్రమ నైజం మారిందా ?

ఎరుపు పేరింటే అదరి పడేటోళ్ళు
కార్మికుడు మారాడంటున్నారు
యూనిఫాం విడిచాడంటున్నారు
తెల్ల చొక్కాలో తడిచాడంటున్నారు
రూపంలో మార్పులు చూపుతూ
తన వర్గమే మారాడంటున్నారు
మార్క్సిజం మాసిందంటున్నారు

కష్టజీవులు సంపద పెంచడం తగ్గిందా?
జీతభత్యాల జమలో వాటా ధనం దక్కిందా?
ఉన్నా లేని జనాల అసమానతలు మాసాయా?
పెట్టుబడి ఫిరంగులు కురంగులయ్యాయా?
ఏది మారింది కనుక ఎరుపు మెరుపు మాసింది?

పిల్లి ఢీలా పడితే ఎలుక ఎకసెక్కాలాడినట్టు
చట్ట సభల సీట్లతో కొలిచి ఎరుపు ఘాటేదంటూ
కష్టజీవుల వాటాకు కొర్రీలు పెడితే పెట్టచ్చు
అలా పడినప్పుడు ఉబికే కంటి తడి తుడిచేదెవరు?
ఎకసెక్కాలకేం ఎన్నైనా ఆడొచ్చు
ఎర్ర జెండా అయి నిలిస్తే నిజం లోతు కనిపిస్తుంది
జనానికి దాని అవసరం తెలుస్తుంది ... ఏదీ లేని..
గాలి పడవలు వాటం తప్ప గమ్యం ఎరుగవుగా?

జీతాల కోతలతో శ్రమ వాటా గుంజేయడం
పనిలేని జీవులు ఆకలి, ఆత్మహత్యల
కాష్టంలో కమిలి కాలి బూడిదవడం
వాళ్ళ వాటా సంపదతో
'కార్పొ'ల ఆస్తులు పెంచుకోవడం
దాన్ని 'సొంత ఆస్తి' లెక్కలతో చుక్కల్లో నిలవడం
ఉన్న లేని జనాల వర్గ స్వరూపమేగా
కడుపు కాలిన నాడు వాటాల సమ పంపకానికి
వీధుల్లో కలబడటం వర్గ పోరాటమేగా
కళ్ళ ముందు కణిక నిప్పులు మండుతుండగా
నిర్వచనాలు మార్చి కళ్ళకు గంతలు తగిలించుకునే
గాంధారి పాతివ్రత్యపు గొప్పల గప్పాలు అవసరమా?

-ఉన్నం వెంకటేశ్వర్లు